


ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064

ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏ.సి.బి.) టోల్ ఫ్రీ నెంబర్ 1064పై విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కోరారు. ఏసీబీ అధికారులు రూపొందించిన పోస్టర్‌ను మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. మరింత సమాచారానికి రాష్ట్ర ప్రధాన కార్యాలయం నెంబర్ 91543 88989/ 040-23251555లో, వాట్సాప్ నెంబర్ 94404 46106లో సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

వ్యవసాయానికి పరిశ్రమల దన్ను

- బుగ్గపాడులో సిద్ధమైన మెగా ఫుడ్‌పార్క్
- రేపే ప్రారంభోత్సవం.. ఆరుగురు మంత్రుల రాక
- 206 ఎకరాలు... రూ.350 కోట్ల నిధులు...



సత్తుపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం బుగ్గపాడులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపట్టిన మెగా ఫుడ్‌పార్క్ ప్రారంభానికి సిద్ధమైంది. గురువారం ప్రారంభోత్సవ కార్యక్రమానికి టీజీఐఐసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆర్‌అండ్‌బీ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మహిళ, శిశు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క హాజరుకానున్నారు.

206 ఎకరాల్లో ఫుడ్‌పార్క్

బుగ్గపాడులో మెగా ఫుడ్‌పార్క్‌ను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. 50 శాతం కేంద్రం, మరో 50శాతం రాష్ట్ర ప్రభుత్వం నిధులు అందించాయి. ఖమ్మం జిల్లాలో సాగవుతున్న పలు పంటలను దృష్టిలో పెట్టుకుని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీని కోసం 2008లో 206ఎకరాల భూమిని సేకరించారు. మొత్తం విస్తీర్ణంలో మెగా ఫుడ్‌పార్క్ 61.13 ఎకరాలు, స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ కోసం 88.85ఎకరాలు, ఎంఎస్‌ఎంఈ (మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రెన్యూర్) జోన్ కోసం 56.15 ఎకరాలు కేటాయించారు. టీజీఐఐసీ (తెలంగాణ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) ఆధ్వర్యంలో ఫుడ్‌పార్క్‌ను అభివృద్ధి చేశారు. ఇందులో భాగంగా పరిశ్రమలకు అవసరమైన వసతులను కల్పించారు. ఫుడ్‌పార్క్‌లో మొత్తం రూ.350కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉండగా రూ.190 కోట్లు ఇప్పటివరకు ఖర్చు చేశారు. పరిపాలన భవనం, ప్యాక్‌హౌస్, వేర్‌హౌస్, ట్రీట్‌మెంట్ ప్లాంట్, కోల్డ్ స్టోరేజ్, వేబ్రిడ్జ్, సబ్‌స్టేషన్, డ్రైనేజీలు, సెంట్రల్ లైటింగ్, ప్రహరీ తదితర నిర్మాణాలను పూర్తి చేశారు.

మెగా ఫుడ్‌పార్క్‌లో ఇప్పటివరకు రెండు కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రారంభించాయి. ఎల్లో అండ్ గ్రీన్ కంపెనీ ద్వారా (మిగతా 4వ పేజీలో)

'లోకల్' ఫైట్..

కొత్త సంవత్సరంలో సంక్రాంతి తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగే అవకాశం ఉండడంతో ఉమ్మడి జిల్లాలోని రాజకీయ పార్టీలు ఇప్పటినుంచే ఎన్నికలపై దృష్టి సారించాయి. స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా కార్యాచరణ చేపడుతున్నాయి. జనవరిలో పంచాయతీ ఎన్నికలు, ఆ తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపాలిటీలకు, అనంతరం సహకార సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలు ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకం కావడంతో ఎవరికి వారు సమర సన్నాహాలు చేస్తున్నారు. కులగణన సర్వే అనంతరం రిజర్వేషన్ల ప్రక్రియ కూడా ఖరారయ్యే అవకాశం ఉండడంతో, జిల్లా పంచాయతీ శాఖ అధికారులు పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ప్రక్రియను ప్రారంభించారు. ఖమ్మం జిల్లాలో 589 పంచాయతీలు, 5,398 వార్డులున్నాయి. మొత్తం 8,52,000మంది పల్లె ఓటర్లు ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 481 పంచాయతీలు, 4,232 వార్డులున్నాయి.



'స్థానిక' పోరుకు సన్నద్ధం

ప్రధాన పార్టీల్లో పంచాయతీ ఎన్నికల సందడి

- పల్లెల్లో మొదలైన రాజకీయ కోలాహలం
- ఎక్కడికక్కడ శ్రేణులను సిద్ధం చేస్తున్న నేతలు
- జనంలో పట్టు నిలుపుకొనేలా కార్యాచరణ
- మెజారిటీ పంచాయతీలను దక్కించుకునేలా వ్యూహాలు
- సంక్రాంతి తర్వాత మోగనున్న నగారా?

ఖమ్మం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో రాజకీయ పార్టీల కార్యక్రమాలు, సభలు, సమావేశాల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని నేతలు తమ పార్టీ కేడర్‌కు పిలుపునిస్తున్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కూడా కార్యకర్తలతో సమావేశం నిర్వహించింది. ఈ సంబురాల ద్వారా గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలు రాబోయే పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలని, ఈ ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు రైతు రుణమాఫీ వంటి అంశాలను ప్రస్తావించి కేడర్‌ను ఎన్నికలకు సమాయత్తం చేయాలని సూచించారు. దీనికి తోడు ప్రజాపాలన సంబురాలకు కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా మాజీ ఎంపీ రవీంద్ర నాయక్‌ను నియమించింది.

బీఆర్‌ఎస్‌తో పాటు ఇతర పక్షాలు...

స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీఆర్‌ఎస్ కూడా ఎన్నికలకు కేడర్‌ను సిద్ధం చేస్తోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో జిల్లాలో పార్టీ ఘోర పరాజయం చెందడం, రాష్ట్రంలో అధికారం పోవడంతో స్తబ్దుగా ఉన్న బీఆర్‌ఎస్, తన కేడర్‌ను మళ్లీ కార్యాచరణలోకి దింపుతోంది. ఈ నెలలోనే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సమావేశాలు నిర్వహించి పార్టీ కేడర్‌ను కార్యక్రమాల్లో అప్రమత్తం చేశారు. దీనికి తోడు మాజీమంత్రి హరీ‌ష్‌రావు కూడా ఇటీవల జిల్లాలో మరణించిన రైతు కుటుంబాలను పరామర్శించి పంచాయతీ ఎన్నికల వైపు కేడర్‌ను సిద్ధం కావాలని దిశా నిర్దేశం చేశారు. అలాగే నవంబరు 30 దీక్షాదివస్ కార్యక్రమాలను కూడా ఖమ్మం, కొత్తగూడెంలో నిర్వహించారు. రెండు జిల్లాల నుంచి కేడర్ ఎక్కువ మంది హాజరయ్యేలా బీఆర్‌ఎస్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. గతంలో అధికారంలో ఉన్నందున పంచాయతీ ఎన్నికలు ఏకపక్షంగా గెలిచామని, ఈసారి ప్రతిపక్షంలో ఉండి పోరాటం సాగించాల్సి ఉంటుందని, అందువల్ల ఇప్పటి నుంచే పంచాయతీ ఎన్నికలపై దృష్టి సారించాలని కొందరు నాయకులు తమ ప్రసంగాల్లో సూచించారు.

ఇక జిల్లాలో బీజేపీ, వామపక్షాలు కూడా పంచాయతీ ఎన్నికల్లో తమ ప్రభావం చూపేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. అందులో భాగంగా కాంగ్రెస్ ఏడాది పాలనపై చార్జిషీట్ అంటూ బీజేపీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రచారంలోకి తెస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగా (మిగతా 4వ పేజీలో)



ఎట్టకేలకు...

- పోలేరు జేఎన్‌టీయూకు రూ.108.60 కోట్లు
- ఫలించిన మంత్రి పొంగులేటి చొరవ

4



అదే కథ..

- పురోగతి లేని కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాల
- ప్రారంభమై మూడేళ్లయినా నత్తనడకే...

5



తీరని నష్టం...

- సెప్టెంబరు నాటి వరదల వల్ల రూ.672.78 కోట్ల నష్టం
- కేంద్ర బృందానికి కలెక్టర్ నివేదిక

4



జీళ్లచెరువులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- 6 నుంచి 'ఇందిరమ్మ' లబ్ధిదారుల ఎంపిక
- నియోజకవర్గానికి 3,500చొప్పున ఇళ్లు
- సంక్రాంతి తర్వాత రైతు భరోసా
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

4



ఖమ్మంలో గోద్రెజ్ ఆయిల్‌ఫెడ్ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

భవిష్యత్తు అంతా ఆయిల్‌పామ్‌దే...

- రాష్ట్రంలో 10 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు చర్యలు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- గోద్రెజ్ ఆయిల్‌ఫెడ్ అధికారులతో సమీక్ష

4

ఫేస్‌ టు ఫేస్



పెరిగిన చార్జీల ప్రకారమే మెనూ

కె. సత్యనారాయణ, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్

ప్రశ్న: జిల్లాలో ఎంతమంది ఎస్సీ విద్యార్థులు వసతి పొందుతున్నారు?

జవాబు: మొత్తం 4,334మంది విద్యార్థులు ఎస్సీ హాస్టళ్లలో ఉంటున్నారు. 3నుంచి పదో తరగతి వరకు 41, పది నుంచి పీజీ వరకు 11కాలేజీ వసతిగృహాలు ఉన్నాయి. బాలికలకు 5, బాలురకు 6 ఉన్నాయి.

ప్ర: వసతిగృహాల్లో విద్యార్థులకు భోజనాల అమలు ఎలా ఉంది?

జ: పెరిగిన చార్జీల ప్రకారమే మెనూ అమలు చేస్తున్నాం. నెలకు నాలుగు సార్లు చికెన్, ఆరుసార్లు కోడిగుడ్లు పెడుతున్నాం. ప్రతి రోజూ ఒక పండు, ఇతర భోజన పదార్థాలు అందిస్తున్నాం.

ప్ర: అందిస్తున్న సౌకర్యాలెలా ఉన్నాయి?

జ: విద్యార్థులకు ఇప్పటికే రెండు జతల దుస్తులు, బెడ్ షీట్, కార్పెట్, పరుపు, స్వెటర్లు అందించాం. రగ్గులు అందించేందుకు ఏర్పాట్లు చేశాం.

ప్ర: పదిలో ఉత్తీర్ణతశాతం ఎలా ఉంది:

జ: వసతిగృహాల విద్యార్థులు పదో తరగతిలో 98శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్, బుక్స్ అందిస్తున్నాం. స్పెషల్ క్లాస్‌లు నిర్వహిస్తున్నాం.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం సంక్షేమ విభాగం

మాతృత్వానికి వెల



సరోగసి దందా

చాపకింద నీరులా 'అద్దె గర్భం' వ్యాపారం

- ఆర్‌ఎంపీలే మధ్యవర్తులు.. అమలు కాని ఆంక్షలు....
- రూ.15 లక్షలు వసూలు చేసి, సరోగసి మహిళలకు రూ.4 లక్షల చెల్లింపు
- పేద మహిళలే లక్ష్యంగా సాగుతున్న వ్యవహారం
- జిల్లాల వారీగా నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్న సరోగసి ఆస్పత్రులు
- లోపించిన నిఘా.. చేతులు మారుతున్న లక్షలు

ఖమ్మం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నవ మాసాలు మోసి బిడ్డకు జన్మనివ్వడాన్ని మహిళలు ఒక వరంలా భావిస్తారు. కానీ కాలం కలిసిరాక కొందరు... తమ అందం చెదిరిపోవద్దని మరికొందరు... పిల్లల కోసం అద్దె గర్భాలను ఆశ్రయిస్తున్నారు. దాన్ని ఆసరాగా చేసుకుంటున్న పలు ఆస్పత్రుల వారు సరోగసి పేరుతో దందా సాగిస్తున్నారు. అద్దెగర్భం పేరుతో అక్రమాలకు పాల్పడుతూ అమ్మతనాన్ని అంగట్లో సరుకుగా మారుస్తున్నారు. ఈ దందాలో జిల్లాలోని పలువురు పేద మహిళలు, ఆసరాలేని గ్రామీణ ప్రాంతాల వారు పావులుగా మారుతున్నారు. హైదరాబాద్‌కు చెందిన పలు ఆస్పత్రుల నిర్వాహకులు జిల్లాలో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని తమ వ్యాపారాన్ని విచ్చలవిడిగా సాగిస్తున్నారు. ఇటీవల సరోగసి కోసం వెళ్లిన ఓ మహిళ హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడటంతో సరోగసి విధానంలో బిడ్డలను కనేందుకు వెళ్తున్న మహిళలపై జిల్లా అంతటా చర్చసాగుతోంది.

ప్రక్రియ పూర్తయ్యేవరకు రూ.4 లక్షలు

ఖమ్మం జిల్లా కేంద్రంలో ఉన్న పలు ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు (మిగతా 4వ పేజీలో)



'బోనస్' సరే.. 'భరోసా' ఏదీ?

- సన్న ధాన్యానికి రూ.500 బోనస్‌తో రైతుల ఖుషీ
- రైతు భరోసా, రుణమాఫీ ఆలస్యంపై పెదవి విరుపు
- పథకాల అమలులో జాప్యంపై అన్నదాతల్లో అసంతృప్తి

వివరాలు : 4లో

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సమయంలో తొలిసారి ఖరీఫ్‌లో సన్నరకం ధాన్యం క్వింటాకు రూ.500బోనస్ పొంది రైతులు ఖుషీగా ఉన్నారు. అదే సమయంలో ఖరీఫ్‌కు సంబంధించిన రైతుభరోసా నేటికీ చెల్లించకపోవడంతో పాటు రూ.రెండులక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం పట్ల రైతులు పెదవి విరుస్తున్నారు.



ఆంధ్రజ్యోతి ఫోకస్

'బోనస్' సరే..
'భరోసా' ఏదీ?

» సన్నధాన్యానికి రూ.500బోనస్‌తో రైతుల ఖుషీ
» రైతు భరోసా, రుణమాఫీ ఆలస్యంపై పెదవి విరుపు
» పథకాల అమలులో జాప్యంపై అసంతృప్తి

వైరా, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఆ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ప్రతి రైతుకు ఏకకాలంలో రూ.రెండులక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. అలాగే కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఖరీఫ్, రబీ సీజన్లకు కలిపి ఎకరాకు రూ.15వేలు రైతుభరోసా, ధాన్యం క్వింటా ఒక్కింటికి రూ.500బోనస్ ఇస్తామని ప్రకటించారు. అయితే ఇప్పటివరకు నాలుగు విడతల్లో రూ.2,747కోట్లతో సుమారు 25 లక్షల మంది రైతుల రుణాలను మాఫీ చేశారు. ఇంకా సుమారు రూ.పదివేల కోట్ల రుణమాఫీ అమలు చేయాల్సి ఉంది. రూ.రెండు లక్షల పైచిలుకు రుణాలు ఉన్న రైతులకు ఇంకా రుణమాఫీ అందలేదు. కానీ మహబూబ్‌నగర్ సభలో పూర్తిస్థాయిలో రుణమాఫీ చేశామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో ఇక మిగిలిన రుణమాఫీ కథ కంచికేనా అనే ఆందోళనలో రైతులు ఉన్నారు.

సన్నాలకు బోనస్‌తో ఖుషీ..

రూ.రెండులక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం, ఖరీఫ్ రైతు భరోసా రాకపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న రైతుల్లో ఇప్పుడు సన్న ధాన్యానికి రూ.500బోనస్ చెల్లిస్తుండటంతో కొంత సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం విక్రయించిన రెండు, మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో ధాన్యం సొమ్ముతోపాటు మరో ఒకట్రెండు రోజుల్లోనే బోనస్ కూడా జమ అవుతుండటంతో రైతులు ఖుషీగా ఉన్నారు. ఈ క్రమంలో రైతులు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందాలంటే రూ.రెండు లక్షల రుణమాఫీ, ఖరీఫ్ రైతు భరోసా చెల్లిస్తేనే రైతుల్లో ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి తొలగిపోయే అవకాశముంది. ఇదిలా ఉండగా జిల్లాలోని కొన్నిచోట్ల ప్రభుత్వ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ ధాన్యం తరుగు తీస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై అధికారులు సకాలంలో స్పందించి తరుగును అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

రైతుభరోసా, రుణమాఫీ పూర్తిచేయాలి
అయిలూరి శ్రీనివాసరెడ్డి, దాచాపురం



సన్నధాన్యానికి రూ.500బోనస్ ఇవ్వడం సంతోషంగా ఉంది. నేడు ఐదెకరాల్లో వరిసాగుచేసి 120క్వింటాళ్ల ధాన్యం పండించా. రూ.60వేల పైచిలుకు బోనస్ వచ్చింది. అయితే రైతుభరోసా ఇవ్వలేదు. రూ.రెండులక్షల రుణమాఫీ కాలేదు. సకాలంలో వాటిని కూడా మలు చేయాలి.

ఊసులేని రైతుభరోసా..

ఖరీఫ్‌కు సంబంధించిన రైతు భరోసా ఇంతవరకు ఇవ్వలేదు. కౌలురైతుల పరిస్థితి గురించి మాట వరుసకు కూడా ప్రభుత్వం ఎక్కడా ప్రస్తావించకపోవడం ఆ రైతుల్లో అసంతృప్తి కలిగిస్తోంది. 2023 రబీకి సంబంధించి నాటి ప్రభుత్వం ఇవ్వాల్సిన రైతుబంధును కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత లోక్‌సభ ఎన్నికలకు ముందు ఏప్రిల్ మొదటివారం వరకు చెల్లించింది. అయితే ఆ రబీ తాలూకు రైతుబంధు నిధులను తామే చెల్లించినట్లు మెలిక పెట్టడాన్ని రైతులు నిరసిస్తున్నారు. ఖరీఫ్ రైతు భరోసా ఎకరాకు రూ.7,500 చెల్లించకుండా ఎగనామం పెట్టేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోందని, ఇది సరైంది కాదని రైతులు పేర్కొంటున్నారు. మరోవైపు ఇప్పటికే రైతుభరోసా విధి విధానాలపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం జిల్లాల వారీగా సదస్సులు నిర్వహించి రైతుల అభిప్రాయాలు సేకరించింది. ఈనెల 9నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై చర్చించి సంక్రాంతి తర్వాత రైతు భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని ప్రకటించింది. అయితే సాగుచేసే భూములకు ఖరీఫ్, రబీ కలిపి రైతుభరోసా ఎకరాకు రూ.15వేల చొప్పున చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

సన్నాలకు రూ.50వేల బోనస్ వచ్చింది
గడిపూడి రామకృష్ణ, రైతు, గరికపాడు



తాను ఐదెకరాల్లో వరిసాగు చేశా. వంద క్వింటాళ్ల ధాన్యం పండింది. క్వింటాకు రూ.2,320చొప్పున కొనుగోలు కేంద్రంలో విక్రయించా. ధాన్యం సొమ్ముతోపాటు క్వింటాకు రూ.500చొప్పున వంద క్వింటాళ్లకు రూ.50వేల బోనస్ సొమ్ము కూడా వెంటనే ఖాతాలో జమఅయింది. గతంలో ఎన్నడూ ఈ విధంగా వెంటనే ధాన్యం సొమ్ము చెల్లించలేదు. అలాగే బోనస్ ఇవ్వలేదు. బోనస్‌తో తాను సంతృప్తిగా ఉన్నా.

బోనస్ డబ్బులు రావడం ఆనందంగా ఉంది
గూడూరు రామిశేషిరెడ్డి, కౌలురైతు, దాచాపురం



నా ఐదెకరాలతోపాటు మా నాన్న, సోదరుడికి చెందిన 15 ఎకరాలను కౌలుకు తీసుకొని మొత్తం 20ఎకరాల్లో వరిసాగు చేశా. 300క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ఈ ధాన్యాన్ని విక్రయించా. ధాన్యం సొమ్ముతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50లక్షల బోనస్ సొమ్మును నా ఖాతాలో జమ చేసింది. ఇది ఎంతో మంచి పరిణామం. తాను ఎంతో సంతోషంగా ఉన్నా. కౌలుకు చేసిన భూములకు కూడా తనకు రూ.4 వేల వరకు బోనస్ సొమ్ము లభించింది. కౌలురైతుగా సుమారు రూ.80వేలు ఆదాయం లభించటంతో ఆనందంగా ఉంది.

వరద బాధితులకు భరోసానిస్తూ..

» పలు గ్రామాల్లో కేంద్ర పీడీఎన్ఏ కమిటీ పర్యటన
» దెబ్బతిన్న చెరువులు, కాల్వల పరిశీలన
» తీవ్రంగా నష్టపోయిన రాకాసితండాలో గ్రామస్థులతో మాటామంతీ

కూసుమంచి/తిరుమలాయపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నేతృత్వంలోని పోస్ట్ డిజాస్టర్ నీడ్స్ అసెస్‌మెంట్ (పీడీఎన్ఏ) కమిటీ బృందం మంగళవారం పాలేరు నియోజకవర్గంలో పర్యటించింది. రెండు నెలల క్రితం వరదల కారణంగా తీవ్ర నష్టం జరిగిన సంగతి తెలిసిందే. అప్పుడు కేంద్ర బృందం వచ్చి పరిశీలించి పలు సూచనలు చేసి వెళ్లిన విషయం విదితమే. ఈ క్రమంలో అప్పుడు జరిగిన నష్టాన్ని ఏవిధంగా అధిగమించారో పరిశీలించేందుకు తాజాగా పీడీఎన్ఏ బృందం వచ్చింది. పాలేరు జలాశయం, సాగర్ ఎడమకాల్వ, పాలేరు పాతకాల్వ, ఎర్రగడ్డతండాలోని భక్తరామదాసుప్రాజెక్టు, తిరుమలాయపాలెం మండలంలోని బీరోలు చెరువును బృందం సభ్యులు పరిశీలించారు. బృందంలో జార్ఖండ్‌కు చెందిన శివజ్యోతి నారాయణ, స్టేట్ క్వాలిటీ మానిటరింగ్ షేక్ ఇమామ్, ఐబీ ఈఈ విజయకుమార్ ఉన్నారు. పాలేరు జలాశయాన్ని, పాతకాల్వను, ఎడమకాల్వను పరిశీలించగా ఐబీ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వరరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పాలేరు జలాశయాన్ని, మత్స్యపరిశోధనా కేంద్రాన్ని నాబార్డ్ రిటైర్డ్ సీజీఎం సీపీ మోహన్, ఐసీఏఆర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డి, పశుసంవరకశాఖ ఏడీ డాక్టర్ శ్రీనివాసరావు పరిశీలించారు. మత్స్యశాఖ ఏడీ శివప్రసాద్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రాకాసితండాలో....

గత సెప్టెంబరు నెలలో కురిసిన భారీవర్షంతో సర్వం కోల్పోయిన రాకాసితండాలో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందం సభ్యులు మంగళవారం పర్యటించారు. కనీవినీ ఎరుగని రీతిలో భారీవర్షం రావడంతో ఆకేరు వరదకు రాకాసితండాలో తీవ్ర ఆస్తినష్టం జరిగింది.



పాలేరు జలాశయం వద్ద వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం

పొలాల్లో ఇసుకమేటలు వేశాయి. ఇళ్లు నీటమునిగాయి. పలుచోట్ల ఇళ్లు కూలిపోయాయి. ఇళ్లలోని బియ్యం, నిత్యావసరాలతోపాటు గృహోపకరణాలు పాడైపోయాయి. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్‌తో పాటు ఖమ్మం ఎంపీ పర్యటించి గ్రామంలో జరిగిన నష్టంపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు నివేదిక అందించారు. ఈ క్రమంలో మంగళవారం అమిత్ బృందం సభ్యులు గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. వరదలతో నష్టపోయిన బాధితుల వివరాలు తెలుసుకున్నారు. వారికి భరోసానిచ్చారు. వారివెంట డీపీవో ఆశాలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ పుష్పలత, ఎంపీవో సూర్యనారాయణ, ఆర్ఐ వీరయ్య, పాల్గొన్నారు.

భవిష్యత్తు అంతా ఆయిల్‌పామ్‌దే...

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గోద్రెజ్ ఆయిల్‌ఫెడ్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఆయిల్‌పామ్ పరిశ్రమ పనులు వెంటనే ప్రారంభించాలని, ఆయిల్‌పామ్ సీడ్ గార్డెన్ దేశంలోనే తొలిసారి ఏర్పాటవుతున్నందున ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. కొణిజర్ల మండలం అంజనాపురంలో 160ఎకరాల్లో ఏర్పాటుకానున్న పామాయిల్ పరిశ్రమ, ఆయిల్‌పామ్ సీడ్‌గార్డెన్ పనులపై మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో గోద్రెజ్ ఆయిల్‌ఫెడ్ అధికారులతో మంత్రి సమీక్షించారు.

ఆయిల్‌పామ్ సాగులో మలేషియా, ఇండోనేషియా దేశాలతో తెలంగాణ రాష్ట్రం పోటీ పడుతోందని, ఆ దిశగా పంట సాగుతోపాటు పరిశ్రమలను కూడా తెలంగాణలో ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు. రాష్ట్రంలో 10లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం టన్నుకు రూ.20,413 ధర లభిస్తున్నదని, దీంతో రైతులు సాగుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని, ఆయిల్‌ఫెడ్‌తోపాటు ప్రైవేటు సంస్థలనుంచి పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తున్నదన్నారు. టన్నుకు రూ.20 వేల మద్దతుధర ఉండేలా దక్షిణాది రాష్ట్రాలనుంచి ప్రతినిధి బృందం కేంద్ర ప్రభుత్వం వద్దకు వెళ్లి వత్తిడి పెంచబోతున్నామని తెలిపారు. ఇప్పటికే కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి ఆయిల్‌పామ్‌కు కనీస మద్దతుధర నిర్ణయించాలని సూచించామని మంత్రి తుమ్మల తెలిపారు.అంజనాపురంలో ఆయిల్‌పామ్ సీడ్ గార్డెన్,ఆయిల్‌పామ్ నర్సరీ పనులు కూడా త్వరితగతిన చేపట్టాలని, దేశంలో ఆయిల్‌పామ్ సీడ్‌గార్డెన్ మొదటగా కొణిజర్ల మండలంలోనే ఏర్పాటు చేస్తున్నందున గోద్రెజ్ కంపెనీ కూడా దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకు పోవాలన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీటి సౌకర్యం కల్పిస్తున్నందున ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పెద్దఎత్తున పామాయిల్ సాగు జరిగేలా ముందుకు పోతున్నామని మంత్రి తెలిపారు.

ఈ సందర్భంగా గోద్రెజ్ పామాయిల్ పరిశ్రమకు ఇంకా అదనంగా స్థలం కావాలని మంత్రి తుమ్మలకు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సీడ్ గార్డెన్ కూడా త్వరలోనే ఏర్పాటు చేస్తామని, ఇందుకు అవసరమైన సాంతికేక పరిజ్ఞానాన్ని సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో గోద్రెజ్ ఆయిల్‌ఫెడ్ సీఈవో షౌగత్‌అయోగ్, జీఎం చావా వెంకటేశ్వరరావు, పామాయిల్ రైతు సంఘం నాయకులు గుత్తా వెంకటేశ్వరరావు, తాతా రఘునాథ్‌తోపాటు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మా నాన్న మృతిపై అనుమానాలు

పోలీసులకు వినతి

ఖమ్మంక్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మానాన్న చేకూరి సత్యంబాబు మృతిపై అనుమానాలున్నాయని మృతుని చిన్నకుమారుడు చేకూరి శేఖర్ టూటౌన్ పోలీసులకు వినతి పత్రం అందించారు. ఖమ్మంలోని ప్రముఖ వ్యాపారి చేకూరి సత్యంబాబు సోమవారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. దీంతో తన తండ్రి ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, కుటుంబంలో కొన్నిరోజుల నుంచి ఆస్తి తగాదాలున్నాయని, ఈ విషయంపై పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుతున్నట్లు శేఖర్ వినతిలో తెలిపారు. సోమవారం ఉదయం తన తండ్రి గుండెపోటుతో మరణించినట్లు తనకు తెలిసిందని, దీంతో అక్కడకు వెళ్లిచూడగా ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడని అంటున్నారని ఈ మృతిపై అనుమానం ఉన్నట్టు తెలిపారు. అదేవిధంగా చేకూరి శ్రీధర్, చేకూరి ప్రవీణ, చేకూరి నాగేంద్రమ్మ, వెంపటి వెంకటరమణ, మొగిలి శ్రీనివాసరెడ్డి అనే వారు ఆస్తిపంపకం చివరి దశకు చేరుకున్న క్రమంలో తనకు ఆస్తిదక్కకూడదనే కుట్ర పన్నినట్టు అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా ఈ విషయంపై టూటౌన్ సీఐ బాలకృష్ణను అడగ్గా వినతి అందించారని, కేసు విచారణలో ఉందని తెలిపారు.

'స్థానిక' పోరుకు సన్నద్ధం

(3వ పేజీ తరువాయి)

వెళ్లేందుకు నాయకులు సన్నాహాలు చేస్తున్నారు. త్వరలో ఈ మూడు పార్టీలతో ఉమ్మడి సమావేశం జరిగే అవకాశం ఉంది. ఇక వామపక్షాల కూడా గ్రామాల్లో పట్టున్న చోట ఎన్నికల బరిలో నిలిచేందుకు సన్నాహాలు చేసుకుంటున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సీపీఐ కలిసి పోటీచేయగా, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, వామపక్షాలు కలిసి పోటీచేశాయి. పంచాయతీ ఎన్నికల్లో వామపక్షాలు సర్పంచ్ పదవులపై దృష్టిపెట్టి బలమున్న చోట బరిలోకి దిగే పరిస్థితి ఉంది.

సరోగసి దందా

(3వ పేజీ తరువాయి)

కొందరు ఆర్ఎంపీల సహకారంతో తమ వైద్యవ్యాపారం సాగించినట్లుగానే, సరోగసికి సంబంధించిన ఆస్పత్రుల నిర్వాహకులు కూడా రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆ ఏజెంట్ల ద్వారా జిల్లాలోని పలుగ్రామాల్లో పరిచయమున్న వ్యక్తుల ద్వారా పేద మహిళలతో బేరం మాట్లాడుకుని వారిని తీసుకెళ్తున్నారు. గర్భం దాల్చినప్పటి నుంచి ఆ మహిళను తమ వద్దనే ఉంచుకుని అన్ని ఖర్చులు వారే భరిస్తున్నారు. బిడ్డకు జన్మనిచ్చిన అనంతరం మూడో కంటికి తెలియకుండా ఇంటికి పంపించేస్తున్నారు. ఈ ప్రక్రియ మొత్తానికి రూ.4లక్షల వరకు మహిళలకు చెల్లిస్తుండగా, అందులోనే గర్భం దాల్చిన తర్వాత నెలవారీ ఖర్చులను కూడా లెక్కిస్తున్నట్టు సమాచారం. అలా వారు బిడ్డకు జన్మనిచ్చేవరకు అయిన ఖర్చులను లెక్కించి ఆ తర్వాత మిగిలిన నగదు ఇచ్చి పంపుతున్నట్టు తెలిసింది.

అయితే ఈ అద్దె గర్భం వెనుక కాసుల మర్మం వేరే ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే ఈ దందాలో మధ్యవర్తులు అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బిడ్డల తల్లిదండ్రుల నుంచి రూ.15 లక్షల వరకు వసూలు చేస్తుండగా గర్భం దాల్చిన మహిళలకు మాత్రం ఖర్చులు పోను రూ.2.5 లక్షలు మాత్రమే ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంలో కొందరు ఆర్ఎంపీలు గతంలో సరోగసికి వెళ్లొచ్చిన మహిళలకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ రెండువైపులా కమీషన్ తీసుకుని సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

జిల్లా నుంచి పలువురు

అనైతికమైన అద్దెగర్భం వ్యాపారం జిల్లాలో జోరుగానే సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ముదిగొండ మండలానికి చెందిన ఇద్దరు మహిళలు వెళ్లొచ్చినట్టు తెలిసింది. ఆ తర్వాత ఖమ్మం నగరంలోని సరితాక్లినిక్, గట్టయ్య సెంటర్ ప్రాంతాల్లో ఇళ్లల్లో పనిచేసుకునే ఇద్దరు మహిళలు కూడా వెళ్లి బిడ్డకు జన్మనిచ్చినట్టు సమాచారం. కాగా ఇటీవల ఆ ఇద్దరు మహిళల్లో ఓ మహిళ మళ్లీ సరోగసి కోసం వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. కాగా నగరానికి చెందిన ఆ ఇద్దరు మహిళలు సరోగసికి వెళ్లేందుకు నగరంలోని వైఎస్ఆర్ నగర్‌కు చెందిన ఓ ఆర్ఎంపీ సహకరించారని, వారు వెళ్లొచ్చిన తర్వాత ఇద్దరు మహిళలు ఒక్కొక్కరు రూ.లక్ష ఇవ్వాలని సదరు ఆర్ఎంపీ డిమాండ్ చేయడంతో అది కాస్త బయటకు పొక్కింది. కమీషన్ ఇవ్వని పక్షంలో దందా బయట పెడతానని సదరు ఆర్ఎంపీ బెదిరించినట్టు తెలుస్తోంది. ఆ సమయంలో సదరు మహిళలు తమకు సరోగసి చేసిన మహిళా డాక్టర్‌కు ఫోన్ చేయగా సదరు వైద్యురాలు తనపేరు బయటకు వస్తే బాగోదని హెచ్చరించడంతో వివాదం సద్దుమణిగిందని తెలిసింది.

చట్టప్రకారం సరోగసి పొందాలంటే...

సరోగసీ విధానం ద్వారా బిడ్డను పొందాలంటే అనేక నిబంధనలు వున్నాయి. సరోగసి ద్వారా బిడ్డను పొందాలనుకునే వారికి వంధ్యత్వానికి సంబంధించిన ధృవీకరణపత్రం, మెజిస్ట్రేట్ కోర్టు ఆమోదించిన సరోగేట్ పిల్లల తల్లిదండ్రుల కస్టడీ ఆర్డరు ఉండాలి. అంతేకాదు అద్దె గర్భం ఇచ్చే మహిళ సదరు దంపతుల్లో ఎవరో ఒకరికి దగ్గరి బంధువై ఉండాలి. ఒకసారి మాత్రమే గర్భం ఇచ్చేందుకు అనుమతి ఉంటుంది.

అంతేకాకుండా అద్దెగర్భం ఇచ్చిన మహిళకు ప్రసవానంతరం సమస్యలకు కవర్ చేసేలా 16 నెలల కాలానికి బీమా కవరేజీ కూడా చేయించాల్సి ఉంటుంది. కానీ జిల్లా నుంచి వెళ్తున్న మహిళలకు అలాంటివేమీ తెలియకుండానే సరోగసీ చేయించేస్తున్నారు. కేవలం ఇక్కడి నుంచి తీసుకెళ్లడం, ప్రసవం కాగానే వెంటనే నగదు సెటిల్ చేసి పంపించడం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాదు ఒకే మహిళను రెండుమూడుసార్లు కూడా అద్దెగర్భం కోసం తీసుకెళ్లడం కొసమెరుపు.

వరదల నష్టం రూ.672.78 కోట్లు

» కేంద్ర బృందానికి కలెక్టర్ నివేదిక
» సమీక్షించిన పీడీఎన్ఏ బృందం సభ్యులు

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సెప్టెంబరులో భారీ వర్షాల నేపథ్యంలో వరదలకు రూ.672.78 కోట్ల నష్టం వాటిల్లిందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఇటీవల సంభవించిన వరద నష్టం అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలోని పోస్ట్ డిజాస్టర్ నీడ్స్ అసెస్‌మెంట్ (పీడీఎన్ఏ) కమిటీ మంగళవారం పలు ప్రాంతాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో బృంద సభ్యులతో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికార యంత్రాంగం సమీక్షించారు. వరద తీరు, చేపట్టిన చర్యలు, నష్టం వివరాలను కలెక్టర్ వారికి వివరించారు.

జిల్లాలో ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 1 వరకు సంభవించిన భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయన్నారు. 229 గ్రామాలలో, 42 పట్టణ ప్రాంతాల్లో 53వేల 430మంది జనాభా వరద బాధితులయ్యారని తెలిపారు. 59సహాయ శిబిరాల ద్వారా 9,516 మందిని తరలించి పునరావాసం కల్పించామన్నారు. వరదలకు ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని ఆ కుటుంబాలకు ఒక్కొక్కరికి ఐదు లక్షల చొప్పున రూ.30 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించినట్టు తెలిపారు. వరదలకు 15వేల 258ఇళ్లు దెబ్బతిన్నాయని, ఇంటికి జరిగిన నష్టానికిగాను రూ.16 వేల 500లను లబ్ధిదారులకు నష్టపరిహారం చెల్లించామన్నారు. పంట, ఆస్తి, జంతు, మత్స్య సంపద, పాఠశాల, ఆస్పత్రి భవనాలు, విద్యుత్, మౌలిక సదుపాయాల, నీటిపారుదల వనరులకు నష్టం జరిగిందని, మొత్తంగా అన్ని శాఖల పరిధిలో 672.78 కోట్ల నష్టం వాటిల్లినట్టు తెలిపారు.



సమీక్షకు హాజరైన జిల్లా అధికారులు

సమావేశంలో సీబీఆర్ఐ డైరెక్టర్ ఆర్.ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ 17మంది సభ్యుల బృందం పీడీఎన్ఏ (పోస్ట్ డిజాస్టర్ నీడ్స్ అసెస్మెంట్)కోసం వచ్చినట్టు తెలిపారు. నష్టం ఎంత జరిగింది, రికవరీ ఎంత అవసరం, పునర్నిర్మాణానికి ఎంత అవుతుందనే అంచనా చేయడానికి బృందం వచ్చినట్టు వివరించారు. జిల్లా అధికారుల నుంచి నష్టం వివరాలు సేకరించి, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయనున్నట్టు తెలిపారు. అధికారులు సమగ్రమైన నివేదిక ఇవ్వాలన్నారు. నివేదికలు క్షేత్ర పరిశీలనల ప్రకారం సహాయానికి నివేదిక రూపొందించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్. పి.శ్రీజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీఆర్‌వో ఎం.రాజేశ్వరి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాలేరు జేఎన్‌టీయూకు రూ.108.60 కోట్లు

» నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు
» త్వరలో భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఖమ్మం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మంరూరల్ మండలం మద్దులపల్లిలోని పాలేరు జేఎన్‌టీయూ కళాశాల భవన నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం రూ.108.60 కోట్లు మంజూరు చేసింది. శాశ్వత భవనాల కోసం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ విభాగం రూ.300 కోట్లతో ప్రతిపాదనలు చేసి పాలేరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అందించారు. దీంతో మంత్రి పొంగులేటి చొరవ తీసుకుని ప్రభుత్వం నుంచి మొదటి విడతగా రూ.108.60 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో హాస్టల్ భవనాలతో పాటు అకడమిక్ బ్లాక్‌ను నిర్మించనున్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి కల్లా పనులు పూర్తిచేయాలని జేఎన్‌టీయూ అధికారులు భావిస్తున్నారు. మద్దులపల్లిలో కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం 30 ఎకరాల భూమి కేటాయించింది. గతేడాది ఇంజనీరింగ్ కళాశాలను ఐటీడీఏకు చెందిన ఒకేషనల్ ట్రైనింగ్ భవనంలో తాత్కాలికంగా ప్రారంభించారు. అరకొర సౌకర్యాలతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మొత్తం 223మంది విద్యార్థులు మొదటి, రెండో ఏడాది ఇంజనీరింగ్ చదువుతున్నారు. ఈ ఏడాది కౌన్సెలింగ్‌లో ఎక్కువమంది విద్యార్థులు ఆప్షన్లు ఇచ్చినా.. ఇక్కడి అసౌకర్యాలు చూసి ఇతర కాలేజీలకు మార్చుకున్నారు. ఈ క్రమంలో ఎట్టకేలకు నిధులు మంజూరు కావడంతో వచ్చే విద్యా సంవత్సరానికి కొత్త భవనాలు సిద్ధం కానున్నాయి.

వ్యవసాయానికి పరిశ్రమల దన్ను

(3వ పేజీ తరువాయి)

మామిడి ప్రాసెసింగ్, ఎగుమతులను ప్రారంభించారు. ట్రాన్స్‌జెంట్ సంస్థ కూరగాయలు, డ్రైఫ్రూట్స్ ప్రాసెసింగ్‌ను ప్రారంభించింది. స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో గిరిజన అభ్యుదయ సంఘానికి స్థలాన్ని కేటాయించగా ఇక్కడ పనులు పూర్తి కాలేదు. 2016లో ఫ్రూజన్ ఇండియా కంపెనీకి 5ఎకరాల స్థలం కేటాయించినా ఎలాంటి కార్యకలాపాలు ప్రారంభం కాకపోవడంతో కేటాయింపులను రద్దుచేశారు.

తుమ్మల చొరవ

బుగ్గపాడులో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పితే రైతులకు గిట్టుబాటు ధరతోపాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయిని అంచనా వేస్తున్నారు. ఫుడ్‌పార్క్ ప్రారంభిస్తే మరిన్ని కంపెనీలు ఏర్పాటయ్యే అవకాశాలు మెరుగుపడతాయని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఐఐసీ అధికారులకు సూచించారు.

సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో మామిడి, జామ, డ్రాగన్‌ఫ్రూట్, సపోట, కొబ్బరి, కోకో, కూరగాయలు, అరటి, వరి, మొక్కజొన్న తదితర పంటలను రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. ఆయా పంటల దిగుబడుల ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటైతే రైతులకు కూడా ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నారు.

ఈ క్రమంలో ఫుడ్‌పార్క్‌ను ప్రారంభించి పరిశ్రమలను ఆహ్వానించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల అధికారులకు సూచించారు. ఈ మేరకు ఫుడ్‌పార్క్ ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

» రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

జూలూరుపాడు/కూసుమంచి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాలనలో మార్పు కోరి ఇందిరమ్మ రాజ్యాన్ని సాధించుకున్నామని, ఎటువంటి ప్రజా ప్రభుత్వం రావాలని అందరూ ఆకాంక్షించారో అటువంటి ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలో రూ.3.62 కోట్ల అభివృద్ధి పనులకు మంగళవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌తో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మాచినేనిపేట తండ- తవిసిగుట్ట గ్రామం వరకు రూ.కోటి నిధులతో నిర్మిస్తున్న బీటీ రహదారి, జూలూరుపాడు-వెంకన్నపాలెం సరిహద్దులో రూ.10లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రహదారి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా మండలంలోని అనంతారం గ్రామం నుంచి నల్లబండబోడు వరకు రూ.2.52కోట్ల ఎస్డీఎస్పీఎఫ్ నిధులతో నిర్మించిన బీటీ రహదారిని ప్రారంభించారు.

ఈ సందర్భంగా అనంతారంలో జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా రైతులకు రూ.21 వేల కోట్ల రుణాలను మాఫీ చేసి చరిత్ర సృష్టించామన్నారు. వరి వేస్తే ఉరి అన్న ఆనాటి పెద్దమనిషి కేసీఆర్ ఆలోచనలకు భిన్నంగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పండించని విధంగా ఇందిరమ్మ రాజ్యంలో రైతులు ధాన్యాన్ని పండించారని తెలిపారు.



కూసుమంచి మండలంలో ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి పొంగులేటి

సంక్రాంతి తర్వాత రైతు భరోసాను అందించేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పంటలు సాగు చేసిన రైతులందరికీ సంక్రాంతి తర్వాత నుంచి రైతు భరోసాను అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారని పేర్కొన్నారు. ఈ నెల 5న ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సంబంధించిన యాప్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని, 6వ తేదీ నుంచి అధికారులు గ్రామాల్లోకి వచ్చి అర్హులైన పేదలను గుర్తించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారని తెలిపారు. రాష్ట్రంలో తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేస్తామని, నియోజకవర్గానికి కనీసం 3,500చొప్పున ఇళ్లను ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఈ సభలో భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, కొత్తగూడెం ఆర్డీవో మధు, ఐటీడీఏ, పీఆర్ ఈఈలు తానాజీ, శ్రీనివాసరావు, డీఈలు మధుకర్, సత్యనారాయణ, డీఎల్‌పీవో రమణ, తహసీల్దార్ స్వాతి బిందు, ఇన్‌చార్జి ఎంపీడీవో తాళ్లూరి రవి, కాంగ్రెస్ జిల్లా నాయకులు బొర్రా రాజశేఖర్, లేళ్ల వెంకటరెడ్డి, నాగసీతారాములు, పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్‌నాయక్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, సుమంత్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

విషప్రచారం చేసేవారికి బుద్ధి చెప్పాలి

ప్రజా ప్రభుత్వంపై విషప్రచారం చేసేవారికి ప్రజలే బుద్ధి చెప్పాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మంజిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువు గ్రామంలో ప్రజాపాలన విజయోత్సవంలో పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రజలు నమ్మి రాజ్యం అప్పగిస్తే గడిచిన పదేళ్లలో మిగులు సంపదంతా కొల్లగొట్టారని ధ్వజమెత్తారు. ప్రజలు నిరంకుశపాలనకు చరమగీతం పాడి ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దినేని స్వర్ణకుమారి, పలువురు పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



ఐబీ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఆగస్టు చివరి నాటికి గోదావరి జలాలు అందించాలి

- వేసవి నాటికి వంతెనలు, కాల్వలు పూర్తి చేయాలి
- ప్రభుత్వ భూములు ఆక్రమణ జరగకుండా చర్యలు తీసుకోవాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

దమ్మపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది ఆగస్టు చివరి నాటికి సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు అందించాలని నీటిపారుదలశాఖ అధికారులను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గండుగలపల్లిలో మంత్రి తుమ్మలను ఆయన నివాసంలో నీటిపారుదల శాఖ అధికారులు మంగళవారం కలిశారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వేసవి కాలం పూర్తి అయ్యేనాటికి ప్రణాళికతో వంతెనల నిర్మాణాలు, కాలువలు, యాతాలకుంట టన్నెలను పూర్తి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే వ్యవసాయ సీజన్ నాటికి గోదావరి జలలాను అందించాలని ఎస్ఈ శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. ప్రభుత్వభూములు ఆక్రమణలు జరుగకుండా చూడాలని, ప్రభుత్వ అవసరాలకు భూములు లేవని, మందలపల్లి గిరిజన గురుకుల కళాశాల, పాఠశాల సమీపంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికావడంపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ నరేష్‌ను మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ అవసరాలకు సీతారామ మట్టిని ఉపయోగించకుండా అటవీ కార్పొరేషన్ అధికారులు అడ్డుకోవడంపై మంత్రి తుమ్మల ఆగ్రహం వ్యక్తం చేస్తూ తీవ్రంగా మందలించారు. సత్తుపల్లి అటవీశాఖకు చెందిన అర్బన్ పార్క్‌కు పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు చేపట్టి వన్యప్రాణులను కాపాడాలని ఫారెస్టు అధికారులకు మంత్రి సూచించారు. దురుదపాడు గ్రామానికి చెందిన గిరిజనులు పోడు పట్టాలు రాలేదని తుమ్మల దృష్టికి తీసుకురావడంతో ఐటీడీఏ పీవోతో తుమ్మల ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. అశ్వారావుపేటలో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో వివక్ష చూపకుండా పనులను చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఈనెల 8న గండుగుపల్లిలో నిర్మించే రామాలయం భూమి పూజకు రావాలని మంత్రి తుమ్మలను గ్రామస్థులు ఆహ్వానించారు. తుమ్మలను కలిసిన వారిలో పామాయిల్ అడ్వైజరీకమిటీ సభ్యుడు ఆలపాటి రాంచంద్రప్రసాదు, బండి భాస్కర్, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వాసం రాణి, కొయ్యల అచ్యుతరావు, మన్నెం అప్పారావు, కేవీ సత్యనారాయణ, కాసాని నాగప్రసాద్, ఎర్రా వసంతరావు, పలు శాఖల అధికారులు ఉన్నారు. భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ క్యాలెండర్‌ను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయన నివాసంలో ఈవో రమాదేవితో కలిసి ఆవిష్కరించారు.



వైద్య కళాశాలకు సుస్తీ

- పురోగతి లేని కొత్తగూడెం మెడికల్ కాలేజీ
- నర్సింగ్ కళాశాలలోనే తరగతులు
- అసంపూర్తిగా వసతి గృహాలు
- ప్రారంభమై మూడేళ్లయినా నత్తనడకే
- ప్రైవేటు హాస్టళ్లలో విద్యార్థులు
- ప్రాక్టికల్స్ కోసం కిలో మీటర్ల ప్రయాణం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు పూర్తి స్థాయి భవనం లేకపోవడంతో నర్సింగ్ కళాశాలలోనే తరగతులు నిర్వహిస్తారు. నర్సింగ్ కళాశాల కోసం వేరే భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. మెడికల్ కాలేజీలో తగిన వసతులు లేవని, పరికరాలు రావాల్సి ఉందని విద్యార్థులు అంటున్నారు. ప్రాక్టికల్స్ కోసం ప్రత్యేకంగా గదులను ఏర్పాటు చేయాలని విద్యార్థులు ఇటీవల ధర్నా నిర్వహించారు. స్పందించిన డీఎంఈ అధికారులు కళాశాలలో అన్ని వసతులు సకాలంలో సమకూరుస్తామని హామీ ఇచ్చారు. రూ.40 కోట్లు తక్షణమే విడుదల చేయడంతో మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు వేగం పుంజుకున్నాయి.

మూడేళ్లయినా సొంత భవనం లేదు..

కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటై మూడేళ్లు పూర్తి కావస్తున్నా పురోగతి మాత్రం కనిపించలేదు. మెడికల్ కళాశాలను డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ రూ.174 కోట్ల నిధులతో 2022 ఏడాదిలో ఏర్పాటు చేసింది. కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ పరిధిలో 2022 నవంబరు 15వ తేదీన 150 వైద్య సీట్లు మంజూరు చేసి ప్రారంభించారు. 2022-23 ఏడాదిలో కళాశాల తొలి బ్యాచ్‌కు 150 సీట్లుకు గాను 149 సీట్లు, 2023-24 రెండో బ్యాచ్-150 సీట్లు, 2024-25 మూడో బ్యాచ్ -150 సీట్లు కేటాయించారు. మూడు బ్యాచ్‌లకు కలిపి సుమారు 449 మంది విద్యార్థులు ఉన్నారు. హాస్టల్ భవనాల నిర్మాణం పూర్తి కానందున విద్యార్థులకు ప్రైవేటు హాస్టళ్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. అవి కూడా చాలా దూరం ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. మెడికల్ కళాశాల ప్రాంగణంలోనే హాస్టల్ భవనాల నిర్మాణం ప్రారంభమైనా నత్తనడకన కొనసాగుతున్నాయి.

పాఠాలు చెప్పే వారేరీ...

కొత్తగూడెం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు 101 మంది అధ్యాపకులు విద్యార్థులకు వైద్య విద్యను అందిస్తున్నారు. కళాశాలలో 127 అధ్యాపక పోస్టులను భర్తీ చేపట్టనున్నారు. వీటిలో ప్రొఫెసర్లు- 9, అసోసియేట్ ప్రొఫెసర్లు- 35, అసిస్టెంట్ ప్రొఫెసర్లు-14, ట్యూటర్లు-17, సీనియర్ రెసిడెంట్లు-57 కాంట్రాక్ట్, గౌరవ వేతనం ప్రతిపాదికన ఇంటర్వ్యూలు నిర్వహించగా అభ్యర్థులు నామ మాత్రంగా హాజరయ్యారు. అధ్యాపకేతర సిబ్బందిని 19 విభాగాల్లో 155 పోస్టులను భర్తీ చేసేందుకు ఇటీవలే ప్రకటన విడుదల చేశారు. ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్లకు గెస్ట్ హౌజ్, విద్యార్థుల ఆటవిడుపునకు క్రీడా మైదానం, క్యాంటీన్ లేదు. కళాశాల చుట్టు ప్రహరీ లేకపోవడంతో రక్షణ ప్రశ్నార్థంగా మారింది. కొత్తగూడెం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాక్టీసుకు వెళ్లడానికి సుమారు పది కిలో మీటర్లు ప్రైవేటు వాహనాల్లోనే రాకపోకలు నిర్వహించాల్సి వస్తోంది.

31లోగా ఫ్యాక్టరీల లైసెన్స్ ఫీజు చెల్లించాలి

ఖమ్మం ఖానాపురంహవేలీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఫ్యాక్టరీ యజమానులు 2025 సంవత్సరానికి సంబంధించిన పరిశ్రమల లైసెన్స్ ఫీజు, పరిశ్రమ రిజిస్ట్రేషన్ నెంబరు ద్వారా ఆన్‌లైన్‌లో సమీపంలోని మీసేవ కేంద్రాల ద్వారా ఈ నెల 31వ తేదీ లోగా చెల్లించాలని ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ ఎం. వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ ఫీజులు చెల్లించకుంటే ఫ్యాక్టరీల లైసెన్స్‌ను 2025 జనవరి 1 నుంచి రద్దు చేస్తామని, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440090280 నెంబరును సంప్రదించాలని కోరారు.

విన్నోళ్లెవరో.. విననోళ్లెవరో..!

- డప్పు పట్టి చాటింపు వేస్తున్న మహిళ
- వారసత్వంగా వృత్తిని అందిపుచ్చుకున్న దమయంతి
- సరదాగా నేర్చుకున్న వాయిద్యం బతుకుదెరువయింది..

అశ్వారావుపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):చాటింపు, వివాహాలకు డప్పును కొట్టే వృత్తిని సాధారణంగా మగవారే ఎంచుకుంటారు. అశ్వారావుపేట మండలం, తిరుమలకుంటలో సిద్దెల రాములు అనే వ్యక్తి ఈ చాటింపు ద్వారా సమాచారాన్ని ప్రజలకు అందించేవాడు. రాములుకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రాములు తర్వాత కుమారులు వేరే గ్రామాలకు వెళ్లిపోయారు. వారు చాటింపు వృత్తిని చేపట్టలేదు. కాగా కుమార్తె దమయంతి తండ్రి వద్దే ఉండేది. తండ్రి చాటింపులు వేసేటప్పుడు ఆసక్తిగా గమనించే దమయంతి డప్పు కొట్టడాన్ని సరదాగా నేర్చుకుంది. దమయంతి భర్త లేకపోవడంతో ఒంటరిగా పిల్లలను పోషించాల్సి వచ్చింది. తోడుగా ఉన్న తండ్రి చనిపోయాడు. ఈ దశలో సరదాగా నేర్చుకున్న డప్పు వృత్తి ఆసరాగా నిలచింది. డప్పు కొడుతూ గ్రామంలో 'చాటింపు' వృత్తిని చేపట్టింది. వివాహాలకు డప్పు కొట్టడానికి తోటివారితో కలసి వెళుతోంది. పలురకాల ఊరేగింపుల్లో డప్పు కొట్టే అవకాశం వస్తే సద్వినియోగం చేసుకుంటోంది. ఇతర సమయాల్లో కూలికి వెళుతూ జీవనం సాగిస్తోంది. బాల్యంలో సరదాగా నేర్చుకున్న కులవృత్తి బతుకు తెరువును చూపించడం విశేషం.



డప్పు వాయిస్తూ చాటింపు వేస్తున్న దమయంతి

సమసిపోనున్న 'బేతుపల్లి' వివాదం

- సొసైటీ భూముల సమస్య పరిష్కారానికి కదిలిన యంత్రాంగం
- కౌలు రైతులకు చెక్ పెట్టిన అధికారులు
- పంటలు విక్రయించి ఖాతాలో జమ చేసేందుకు నిర్ణయం
- ఎన్నికలు జరిగే వరకూ స్పెషల్ ఆఫీసర్ నియామకం



గిరిజన సొసైటీ భూమి

సత్తుపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని గంగారం పంచాయతీలో ఉన్న గిరిజన సొసైటీ భూములకు సంబంధించి నెలకొన్న వివాదాన్ని పరిష్కరించేందుకు జిల్లా సహకార అధికారి రంగంలోకి దిగారు. వివాదం పూర్తిస్థాయిలో పరిష్కారం అయ్యేవరకూ సొసైటీకి ప్రత్యేక అధికారిని నియమించారు. గిరిజన సొసైటీకి సంబంధించి గత కొద్ది నెలలుగా గిరిజనుల మధ్య వివాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే.

కౌలు ముసుగులో పెత్తనం

గిరిజన సొసైటీ భూములను ఏళ్ల తరబడి కొందరు కౌలుకు తీసుకొని పెత్తనం సాగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. కొందరు రైతులు గిరిజనుల మధ్య వివాదం పరిష్కారం కాకుండా అడ్డుకున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. గిరిజన సొసైటీ భూములను అభివృద్ధి చేశామనే కారణంతో ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నారనే ఆరోపణలు, ఫిర్యాదులు అధికారుల దృష్టికి వచ్చాయి. సొసైటీ భూముల్లో కౌలు వ్యవసాయం చేయకూడదనే నిబంధన ఉన్నా స్థానికంగా ఒక ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాజకీయ అండదండలతో పెత్తనం చేస్తూ భూములు అనుభవిస్తున్నారని మరో వర్గం వాదిస్తోంది. కౌలుదారులు సాగు చేసిన పంటలను స్వాధీనం చేసుకోవాలనే డిమాండ్ కూడా వచ్చింది.

వివాదం పరిష్కారం దిశగా అధికారులు

గిరిజన సొసైటీ భూముల వివాదాన్ని పరిష్కరించేందుకు జిల్లా సహకారశాఖ అధికారి రంగంలోకి దిగారు. గిరిజనులు, పోలీసు అధికారులతో సమావేశమైన సహకార శాఖ అధికారులు సొసైటీలో అర్హులను గుర్తించారు. 2022 ఫిబ్రవరితో సొసైటీ కమిటీ కాలపరిమితి పూర్తికాగా తిరిగి ఎన్నిక నిర్వహించలేదు. సొసైటీ పాలకవర్గానికి త్వరలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. అప్పటి వరకూ కార్యకలాపాలు నిర్వహించేందుకు గాను ప్రత్యేకాధికారిని నియమించారు.

కౌలు రైతులకు చెక్

గత కొన్నేళ్లుగా గిరిజన భూములను అనుభవిస్తున్న కౌలు రైతులకు అధికారులు చెక్‌పెట్టారు. వివాదం పరిష్కారం ప్రక్రియలో భాగంగా కౌలు తీసుకొని సాగు చేస్తున్న సొసైటీ భూముల్లోని పంటల దిగుబడులను స్వాధీనం చేసుకొని విక్రయించి బ్యాంకులో జమ చేయాలని అధికారులు నిర్ణయించారు. దీంతో ఇప్పటి వరకూ కౌలు ముసుగులో గిరిజన భూముల్లో పెత్తనం చేసిన వారికి గట్టి ఎదురు దెబ్బతగలనుంది. మొత్తంగా సొసైటీ వివాదాన్ని పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



మాట్లాడుతున్న హేమంతరావు

8న పోటు ప్రసాద్ సంస్మరణ సభ

ఖమ్మంటౌన్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ సంస్మరణ సభ ఈనెల 8న నగరంలోని పాత మెడికల్ కళాశాలలోని పువ్వాడ ఆడిటోరియంలో జరుగుతుందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ, కౌన్సిల్ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంస్మరణ సభకు సీపీఐ జాతీయ కార్యదర్శి, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్, సీపీఐ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, కె..రామకృష్ణ. సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డితో పాటు జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు.

భద్రాద్రికి చేరిన ఉద్యమకారుల పాదయాత్ర



భద్రాచలం అంబేద్కర్ సెంటర్ వద్ద మలిదశ ఉద్యమకారులు

భద్రాచలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేటలో గతనెల 24న తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సామా అంజిరెడ్డి నాయకత్వంలో ప్రారంభమైన పాదయాత్ర మంగళవారం భద్రాచలం బ్రిడ్జి సెంటర్‌కు చేరుకుంది. బ్రిడ్జి సెంటర్ వద్ద వారికి తెలంగాణ జన సమితి నాయకులు దేవదానం, కరుణాకర్ రెడ్డి, రేపాక రామారావు గుప్తా ఘన స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద కు చేరుకొని అంబేద్కర్‌కు పూల మాలవేసి ఘన నివాళులర్పించి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అంబేద్కర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ జన సమితి నాయకుడు దేవదానం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి, మలిదశ ఉద్యమాల్లో ఎందరో ఉద్యమకారులు తమ ప్రాణాలను సైతం అర్పించారన్నారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. ఉద్యమ కారులను గుర్తించాలని, 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని, పింఛన్లు అందజేయాలని, ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆ వినతిపత్రంలో డిమాండ్ చేశారు. ఈ సమయంలో స్పందించిన ఎమ్మెల్యే వెంకట్రావు మీ సమస్యలు న్యాయమైనవని, వీటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి తప్పక పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

క్రైం సమాచారం

రెండు క్వింటాళ్ల ముష్టి గింజల పట్టివేత

కరకగూడెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాళ్లవాగు సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలపై తరలిస్తున్న రెండు క్వింటాళ్ల ముష్టి గింజలను మంగళవారం ఫారెస్టు బీట్ ఆఫీసర్ విజయ్ పట్టుకున్నారు. రెండు ద్విచక్ర వాహనాలను, ఇద్దరు వ్యక్తులను ముష్టి గింజలను ఏడూళ్ల బయ్యారం రేంజ్ కార్యాలయానికి తరలించారు. ఈ విషయంపై రేంజర్ ఉపేందర్ వివరణ కోరగా.. దేమరతోగు గ్రామంలో రూ.13వేల విలువ చేసే ముష్టి గింజలను కొనుగోలు చేసి అక్రమంగా ద్విచక్ర వాహనంపై పాల్వంచ తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను రెండు ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. అపరాధ రుసుము కింద రూ.26 వేలు, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ విజయ్, రాంబాబు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి బలవన్మరణం



వేణు మృతదేహం

మధిర రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం మధిర మండలం నాగవరప్పాడు గ్రామంలో చోటుచేసుకుంది. ప్రేమవ్యవహారమే ఆత్మహత్యకు కారణమని పలువురు భావిస్తున్నారు. నాగవరప్పాడు గ్రామానికి చెందిన తోక వేణుగోపాలరావు అలియాస్ వేణు(25) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి 20రోజుల క్రితం గ్రామంలో ఓ యువతితో కుటుంబ సభ్యులు వివాహం ఖరారు చేశారు. అయితే వేణు గ్రామంలో మరో యువతిని ప్రేమించాడు. పెద్దలు మరో సంబంధం నిశ్చయించడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన వేణు మెట్టగుట్ట సాగర్‌కాల్వ వద్ద పురుగుల మందు సేవించాడు. కుటుంబసభ్యులు వేణు కోసం ఫోన్ చేయగా తాను పురుగులమందు తాగానని తెలిపాడు. వారు అక్కడకు వెళ్లి చూసేసరికి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. వెంటనే మధిరలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు చికిత్స కోసం తరలించగా, విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి దాటాక మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరి పరీవాహకంలో ముమ్మర గస్తీ

- విస్తృతంగా వాహన తనిఖీలు



గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు

పినపాక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో బయ్యారం సర్కిల్ పరిధిలోని పరీవాహక ప్రాంతాలపై పోలీసులు డేగకన్ను వేశారు. ఇటీవల వరుస ఎన్‌కౌంటర్లతో డీలా పడ్డ మావోయిస్టులు సేఫ్ జోన్‌కు (సురక్షిత ప్రాంతం) తరలి వెళ్లవచ్చనే ముందస్తు సమాచారంతో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు, సోదాలు చేపట్టారు. మంగళవారం ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు గోదావరి పరివాహక ప్రాంతాలైన చింతల బయ్యారం, భూపతిరావుపేట గ్రామాల్లో పర్యటించి, పడవ రేవు ప్రాంతాలను క్షుణ్నంగా పరిశీలించారు. ఈ మేరకు పడవు రేవు పాటదారులతో మాట్లాడి సూచనలు చేశారు. కొత్త వ్యక్తులకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి సహకరించవద్దని, రాత్రి సమయంలో పడవ దాటించవద్దని హెచ్చరించారు. ఏటురునాగారం - మణుగూరు ప్రధాన రహదారి పై దుగినేపల్లి, జానంపేట, వెంకటేశ్వరపురం గ్రామాల వద్ద విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీజీపీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓనర్ మందలించాడని లారీ డ్రైవర్ ఆత్మహత్య

పెనుబల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్‌ను ఓనర్ మందలించాడని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై మంగళవారం వీఎం బంజర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మృతుడి భార్య ఏసమ్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమాల జయరాజు(43)లారీడ్రైవర్‌గా సత్తుపల్లికి చెందిన సామినేని వేణు వద్ద లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల ఒకటోతేదీ ఉదయం సత్తుపల్లిలోని కిష్టారం ఓసీలో లారీలో బొగ్గు లోడ్ చేసుకొని చీరాల వెళ్తుండగా వినన్నపేట సమీపంలో బొగ్గు లారీ దిగబడింది. విషయాన్ని జయరాజు తన ఓనర్‌కు సమాచారం అందించాడు. అదేరోజు సాయంత్రం లంకపల్లిలోని బంధువుల ఇంటికి జయరాజు వెళ్లాడు. అక్కడకు లారీ ఓనర్ వేణు వచ్చి నీవల్లనే తనకు నష్టం కలిగిందని, లారీ దిగబడిందని మందలించి లారీని తీసుకొని వద్దామని కోరాడు. దీంతో జయరాజు ఇంటి వెనుక ఉన్న గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. వాంతులు చేసుకుంటుండగా గమనించి ఓనర్ వేణు, బంధువులు సత్తుపల్లి ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. జయరాజు భార్య వీఎం బంజర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రోడ్డు ప్రమాదంలో కూరగాయల వ్యాపారి దుర్మరణం



సత్యం మృతదేహం

కల్లూరు, డిసెంబరు 3 (ఆంధజ్యోతి): మండల పరిధిలోని కొర్లగూడెం గ్రామం క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కూరగాయల వ్యాపారి ఒకరు మృతి చెందాడు. పెనుబల్లి మండలంలోని టేకులపల్లి గ్రామానికి చెందిన కూరగాయాల వ్యాపారి జోనబోయన సత్యం(46) కల్లూరు మండలంలోని రామకృష్ణపురం గ్రామంలో కూరగాయలు అమ్మడానికి వెళ్లాడు.

స్వగ్రామానికి తిరిగి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. సత్యం భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదుతో కల్లూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి దూకిన ప్రయాణికుడు

- ఆదిలాబాద్ వ్యక్తికి తీవ్ర గాయాలు



సాయి చరణ్‌ను నదిలో నుంచి తీసుకువస్తున్న 108, రైల్వే పోలీస్ సిబ్బంది

మధిర, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నడుస్తున్న రైలునుంచి దూకి ప్రయాణికుడికి గాయాలైన సంఘటన మంగళవారం మధిరలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఆదిలాబాద్ జిల్లా గిర్నూర్‌కు చెందిన 28ఏళ్ల రేగళ్ల సాయి చరణ్ మతి స్థిమితం లేకపోవడంతో రైలు మధిర సమీపంలోని వైరానది బ్రిడ్జి వద్దకు రాగానే రైలు నుంచి దూకాడు. వైరానది నీళ్లలో పడటంతో గాయాలతో బయటపడ్డాడు. రెండు కాళ్లు విరిగి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే రైలులోని ప్రయాణికులు అందించిన సమాచారంతో 108 సిబ్బంది గాయాలపాలైన అతడిని మధిర ప్రభుత్వాస్పత్రికి అక్కడ నుంచి ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి, కానిస్టేబుల్ ఉదయ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు తెలిపిన వివరాల ఆధారంగా ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

కొణిజర్ల, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొట్లకుంట సమీపం శివారులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు చేశారు. ఎస్ఐ సూరజ్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.16,700ల నగదును, నలుగురు వ్యక్తులను స్టేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

పోక్సో కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలు

కొత్తగూడెం లీగల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో వ్యక్తికి ఐదు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధిస్తూ కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఎసీ పోక్సో స్పెషల్‌కోర్టు) పాటిల్ వసంత్ మంగళవారం తీర్పు చెప్పారు. అశ్వాపురం గ్రామానికి చెందిన సుగ్గల ఉమామహేశ్వరరావు అనే వ్యక్తి తన ఇంటి సమీపంలోని ఓ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. 2022 అక్టోబరు 27న బాలిక కుటుంబ సభ్యులు అప్పటి అశ్వాపురం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఆ కేసులో నేరం రుజువు కాగా న్యాయమూర్తి ఐదు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, రూ. 10వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ట్రాన్స్‌ఫారంలో కాపర్‌వైరు, ఆయిల్ చోరీ

కల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిన్నకోరుకొండి గ్రామంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సాగర్ కాల్వ ఎత్తిపోతల పథకం వద్ద గల 100 కేవీ ట్రాన్స్‌ఫారంలో కాపర్ వైరు, ఆయిల్‌ను చోరీ చేశారు. వీటి విలువ రూ. 2 లక్షల వరకు ఉంటుందని జలవనరులశాఖ వారు అంచనా వేశారు. సోమవారం సాయంత్రం వరకు లిఫ్ట్ పనిచేసింది. మంగళవారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్‌వైరు, ఆయిల్ చోరీ అయినట్లుగా రైతులు గుర్తించారు.



విలీన ప్రాంతాల అభివృద్ధికి కార్యాచరణ

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- వైఎస్ఆర్ నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- సీఎం కప్ లోగో ఆవిష్కరణ
- రైతుబజార్ పునరుద్ధరణకు శంకుస్థాపన



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో విలీనమైన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో నిధులు మంజూరు చేయించి తొలి ఏడాదిలోనే అభివృద్ధి చేశామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరరావు పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరన్ని నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. మంగళవారం 8వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ లకావత్ సైదులునాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. వైఎస్ఆర్ నగర్‌లో రూ.4.10 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపనలు చేశారు. ప్రజలతో మంత్రి నేరుగా మాట్లాడారు. వైఎస్ఆర్‌నగర్‌కు బస్టాప్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులు, మహిళలకు బస్ సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరారు. ఇంటినెంబర్లు కేటాయించాలని,తాగునీటి సౌకర్యం, విద్యుత్ మీటర్లు కేటాయించాలని ప్రజలు విన్నవించారు. తక్షణం సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. అనంతరం సీఎం కప్ లోగోను మంత్రి ఆవిష్కరించారు. మేయర్ పునుకొల్లు నీరజ డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, కార్పొరేటర్లు లకావత్ సైదులునాయక్, మలీదు వెంకటేశ్వర్లు, కమర్తపు మురళీ, కొత్తపల్లి నీరజ, నాయకులు సాధు రమేశ్‌రెడ్డి, దొబ్బల సౌజన్య, పొర్లు నాగేశ్వరరావు, కొత్తపల్లి పుష్ప, భూక్య బాలు, షేక్ పాషా, దరిపల్లి నాగేశ్వరరావు, మహిబూబ్‌బీ, రామ్‌బాయి, కోట మహేష్, అబ్రహం, మోహినుద్దీన్ పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థమే రైతుబజార్ పునరుద్ధరణ

ఖమ్మంమార్కెట్: ఖమ్మం నగర ప్రజల సౌకర్యార్థమే పెవీలియన్ గ్రౌండ్ రైతు బజార్‌ను పునరుద్ధరిస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కోన్నారు. మంగళవారం పెవీలియన్‌గ్రౌండ్ పాత రైతు బజార్‌ను పునఃనిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రఘునాథపాలెం మండల రైతులు మాత్రమే ఇక్కడ అమ్ముకోవాలని అన్నారు. ఈ రైతుబజార్‌లోనికి దళారులకు, కూరగాయలు హోల్‌సేల్ మార్కెట్‌లో కొని అమ్మేవ్యాపారులకు ఎట్టి పరిస్థితుల్లోనూ లోపలికి అనుమతించవద్దని ఆయన మార్కెటింగ్ శాఖాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్రమార్కెటింగ్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి హలీలమ్, మేయర్ పునకొల్లు నీరజ,డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్,కార్పొరేటర్లు పాలెపు విజయవెకటరమణ, కమర్తపుమొరళి, వీవీపాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదుబాబు, నాయకులు ఉన్నారు.

పథకాల అమలు వేగిరం చేయాలి

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు సూచించిన మంత్రి పొంగులేటి

ఖమ్మంకలెక్టరేట్,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలు మరింత వేగాన్ని పెంచాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు సూచించారు. కలెక్టర్ మంగళవారం మంత్రిని కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న పథకాలపై చర్చించారు. ధరణి సమస్యలు, గృహనిర్మాణ శాఖ వాటితో పాటు ఇతర ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలపై మంత్రి కలెక్టర్‌తో చర్చించారు. అధికారులు, జిల్లా యంత్రాంగం మరింత అంకితభావంతో పనిచేయాలని మంత్రి సూచించారు.



మంత్రి పొంగులేటితో కలెక్టర్

నూకారపు కుటుంబానికి పరామర్శ

ఖమ్మంసంక్షేమవిభాగం: అమెరికాలో జరిగిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన నూకారపు సాయితేజ కుటుంబాన్ని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. మంగళవారం రాపర్తినగర్‌లో వారి ఇంటికి వెళ్లి సాయితేజ తల్లిదండ్రులను ఓదార్చారు. సంఘటన వివరాలను తెలుసుకున్నారు.

హోంగార్డులకు పోటీలు

ఖమ్మంక్రైం,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ఈనెల6న హోంగార్డు రైజింగ్‌డే సందర్భంగా పోలీసు పరేడ్ మైదానంలో మంగళవారం హోంగార్డు సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించారు. ఏడీసీపీ కుమారస్వామి,ఏసీపీసుశీల్‌సింగ్‌పోటీలు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో హోం గార్డుఆర్ఐ సురేష్,లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఆటోకార్మికులకు సహకరించాలి

ఖమ్మంసంక్షేమవిభాగం,డిసెంబరు3: ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి జిల్లా రవాణా అధికారులు సహకరించాలని ఏఐటీయూసీనాయకులు సీహెచ్ విప్లవ్‌కుమార్ ఇన్‌చార్జ్ జిల్లా రవాణా అధికారి వరప్రసాద్‌ను కోరారు. మంగళవారం డీటీవో కార్యాలయంలో ఇన్‌చార్జ్ డీటీవోను కలిసి వినతిపత్రంఅందించారు.తోటసైదులు,బోడ్డ సైదులు, గయాజ్‌పాషా, దేవా, జంగిప్రసాద్, ప్రభాకర్, సిద్దల నగేశ్ పాల్గొన్నారు.



'కాసు'పత్రి!

- మగశిశువైతే రూ.2వేలు.. ఆడశిశువుకు వెయ్యి
- బాలింతల సహాయకుల నుంచి సొమ్ముల వసూళ్లు
- ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో సిబ్బంది తీరు



కాన్పుల గది

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాసులు ఇవ్వందే రోగులను ఇంటికి కదలనివ్వని పరిస్థితి జిల్లా ఆస్పత్రిలో నెలకొంది.. మాతాశిశు ఆరోగ్యకేంద్రంలో గర్భిణులు, వారి సహాయకుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తుండటంతో వారు హడలి పోతున్నారు. అపరేషన్ గది నుంచి బాలింతలు బయటకు తీసుకొచ్చే సిబ్బంది రోగుల సహాయకుల నుంచి సొమ్ములు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఖమ్మం మాతాశిశు ఆరోగ్యకేంద్రం(ప్రసూతి) ఉంది. ఇక్కడికి ఖమ్మం నగరంతో పాటు జిల్లా నలుమూలల నుంచి గర్భిణీలు, బాలింతలు వైద్య సేవల కోసం వస్తుంటారు. నిత్యం 300నుంచి 400 వరకు ఓపీకి వస్తుంటారు. రోజులో సగటున 20నుంచి 25 కాన్పులు చేస్తుంటారు. ఒక వైపు రికార్డు స్థాయిలో ప్రసవాలు చేస్తూ ప్రశంసలు పొందుతున్నా మరో వైపు ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, నర్సింగ్‌సిబ్బంది గర్భిణీలను చీవాట్లు పెడుతూ..అమర్యాదగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అబ్బాయి పుడితే రూ1500 నుంచి 2వేలు, అమ్మాయి పుడితే వెయ్యి రూపాయలు వసూళ్లు చేస్తున్నారని గర్భిణుల బంధువులు బహిరంగంగానే చెబుతున్నారు. వారు కోరినవి ఇవ్వకుంటే చిన్నారిని తొలిచూపుకు కూడా నోచుకోని పరిస్థితులు ఉన్నాయంటున్నారు. కాన్పులగదిలో 600, ఉమ్మనీరు తుడిచేందుకు 200 చొప్పున వసూళ్లు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

సిబ్బంది ఇష్టారాజ్యమే

ప్రొఫెసర్లు ఇద్దరు,అసోసియేట్ ప్రొఫెసర్లు 1, అసిస్టెంట్ ప్రొఫెసర్లు నలుగురు గైనకాలజిస్టులు, హెడ్‌నర్సులు ముగ్గురు, స్టాఫ్ నర్సులు 50 మంది, మొత్తం ఇక్కడ 60 మందికి పైగా సిబ్బంది పనిచేస్తున్నారు. ఉన్నత చదువులు చదువుకుని కూడా రోగులపట్ల , సాటి మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారనే అపవాదు మోస్తున్నారు. అబ్జర్వేషన్ కోసం లేబర్ రూంలో గర్భిణులను సూటిపోటి మాటలతో సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

పురిటి బాధలు పట్టనట్లు ఫోన్లతో కాలక్షేపం

పురిటినొప్పుల బాధను పట్టనట్లు సిబ్బంది సెల్‌ఫోన్లలో.. సొల్లుకబుర్లతో కాలక్షేపం చేస్తున్నారంటూ, గర్భిణుల సహాయకులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఖమ్మంనగరానికి చెందిన నిండు చూలాలు ప్రసవం కోసం జిల్లాప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. ఆస్పత్రిలో చేర్చుకున్నారు. వైద్యుల, సిబ్బంది పరిశీలనలో ఉన్న ఆమెకు నొప్పులు వచ్చినప్పటికీ సిబ్బంది పట్టించుకోవలేదు. డాక్టర్లు, నర్సులు సాధారణ కాన్పుకోసం వేచి ఉంచినట్లు చెప్పినా పరిస్థితి విషయమించడంతో హుటాహుటీన తెల్లవారు జామున ఆపరేషన్ చేసి కాన్పు చేశారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా కడుపులో బిడ్డ మృతశిశువుగా జన్మించినట్లు విచారణలో తేలింది. ఇలాంటి సంఘటనలు మాతాశిశు కేంద్రంలో సర్వసాధారణం అయ్యాయి. దీంతో రోగులు ఈ కేంద్రానికి రావాలంటే హడలిపోతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

ఎల్ కిరణ్‌కుమార్, సూపరింటెండెంట్

మాతాశిశు కేంద్రంలో జరుగుతున్న తీరుపై బాధితులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. లేబర్ రూం, ఆపరేషన్ థియేటర్ సిబ్బందికి పలుమార్లు ఆదేశాలు జారీచేశాం. గతంలో బాలింతలు, వారి సహాయకుల నుంచి డబ్బులు తీసుకుంటున్నారని వచ్చిన ఫిర్యాదులపై సిబ్బందిని హెచ్చరించాం. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	50 రూ.
వంకాయ	28
గుత్తి వంకాయ	34
బీరకాయ	64
పచ్చిమిర్చి	30
కాకరకాయ	38
బెండకాయ	20
పొట్లకాయ	38
దోసకాయ	34-48
చిక్కుడు	58
నాటుచిక్కుడు	88
గోరుచిక్కుడు	38
క్యాబేజీ	34
దొండ	30-38
సొరకాయ	20
క్యారెట్	68
క్యాప్సికం	54
ఆలుగడ్డ	36
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	195
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	మెకానిక్‌రాకీ
కేపీఎస్:	కేశవ చంద్రరమావత్
తిరుమల:	రోటీ కపడా రోమాన్స్
సినీ గెలాక్సీ:	జీబ్రా

హలో ఆర్టీసీ

ఖమ్మం కొత్త బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225979
కార్గోసేవల నెంబరు:	9154298589

ఖమ్మం పాతబస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225965
కార్గోసేవల నెంబరు:	9704345599

సత్తుపల్లి బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225962
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225990
కార్గోసేవల నెంబరు:	9154298595

మధిర బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225961
బస్టాండ్ ఎంక్వయిరీ:	7382925289
కార్గోసేవల నెంబరు:	8143765370

ఆర్టీసీ ఉద్యోగుల వన భోజనాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్ఎం

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ఖమ్మండిపో ఆవరణలో మంగళవారం వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరాం హాజరయ్యారు. కార్మికుల ఐక్యతను పెంచేందుకు సంస్థ ఈకార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం ఉద్యోగులకు పలు క్రీడాపోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం భవాని ప్రసాద్, డిపో మేనేజర్ దినేష్ కుమార్, అకౌంట్ ఆఫీసర్ బాలస్వామి, పర్సనల్ ఆఫీసర్ జిఎస్ నారాయణ, అసిస్టెంట్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో అన్ని వర్గాలకు చేయూత

- సమర్థ పని విధానంతో మున్నేరు ముప్పును ఎదుర్కొన్నాం
- మేయర్ పునుకొల్లు నీరజ
- ప్రజాపాలన విజయోత్సవాల్లో రుణాల పంపిణీ, 2కే ర్యాలీ



మహిళా సంఘాలకు చెక్కును అందిస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల ప్రజలకు చేయూతనిస్తూ ఏడాది పాలన పూర్తి చేసుకున్నామని మేయర్ పునుకొళ్ల నీరజ ఆనందం వ్యక్తం చేశారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం అర్బన్ డే కార్యక్రమం చేపట్టారు. మెప్మా ఆధ్వర్యంలో సర్దార్ పటేల్ స్టేడియం నుంచి ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం వరకు 2కె ర్యాలీ చేపట్టారు. ర్యాలీని మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించి మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా ఖమ్మం నగరంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేశామన్నారు. పారిశుధ్య కార్మికుల నుంచి అధికారుల వరకు సమర్థ పని విధానంతో ముందుకు వెళ్లటం ద్వారానే అనేక విపత్తులను ఎదుర్కొని, రాష్ట్రస్థాయిలోనే శభాష్ అనిపించుకున్నామని గుర్తు చేశారు. అర్బన్ డే సందర్భంగా 39 స్వయంసహాయక సంఘాలకు, 234 మంది వీధివ్యాపారులకు మొత్తం రూ.7.70 కోట్ల రుణాల చెక్కును అందజేశారు. కేఎంసీలో ఇందిరా మహిళాశక్తి ఉత్పత్తుల స్టాల్స్‌ను మేయర్ ప్రారంభించారు. సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు మహిళా సంఘాల స్టాల్స్ నుంచి కాకరకాయ పచ్చడి కొనుగోలు చేశారు. వారం పాటు స్టాల్స్ కొనసాగుతాయని తెలిపారు. అనంతరం పారిశుద్య కార్మికులకు సొకర్యాలను మేయర్ పునుకొల్లు నీరజ పంపిణీ చేశారు. కమిషనర్ అభిషేక్ ఆగస్త్య మెప్మాపీడీ మహేందర్,డీఎంసీ సుజాత, టీఎంసీ సుజాత, ఏడీఎంసీ వెంకటేశ్వరరావు, సీవోలుసాల్మ, రోజా, ద్రౌపతి, ఆర్పీలు పాల్గొన్నారు.

ఆర్‌యూబీని పరిశీలించిన మేయర్, కార్పొరేటర్లు

ఖమ్మం ప్రజల దశాబ్దాల కల త్వరలో నెరవేరబోతుందని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. 46, 49 డివిజన్ల మధ్య నిర్మాణం పూర్తి చేసుకున్న రైల్వే అండర్ బ్రిడ్జ్‌ని మంగళవారం స్థానిక కార్పొరేటర్లతో కలిసి మేయర్ నీరజ పరిశీలించారు. త్వరలోనే మంత్రి తుమ్మల ఆర్‌యూబీని ప్రారంభిస్తారని ప్రకటించారు. కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లు, యర్రం బాలగంగాదర్‌తిలక్, సాధు రమేశ్‌రెడ్డి, ఈఈ కృష్ణలాల్ పాల్గొన్నారు.

దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి):దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం నగరంలోని టీఎస్ జీవోస్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా మహిళా, శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపడానికి క్రీడా పోటీలు దోహదపడతాయన్నారు. ఏ కష్టం వచ్చినా కలెక్టర్‌గా కాకుండా కుటుంబ సభ్యుడిగా నేను మీకు అండగా ఉంటానని, ఎప్పుడైనా తనను కలవచ్చని భరోసా ఇచ్చారు. సర్దార్ పటేల్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులను, సర్టిఫికేట్లు, ప్రశంసా పత్రాలను కలెక్టర్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె. రాంగోపాల్‌రెడ్డి, దివ్యాంగులు, స్వచ్ఛంద సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

హిందూ ధర్మ రక్షా సమితి ర్యాలీ

ఖమ్మంసాంస్కృతికం: బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ హిందూ ధర్మరక్షా సమితి ఆధ్వర్యంలో బుదవారం ఖమ్మంలో బారీర్యాలీ నిర్వహించనున్నారు. ఉదయం 10గంటలకు పెవిలియన్ గ్రౌండ్ నుంచి ప్రారంభం కానున్నది.

నేడు బస్‌డిపోల ఎదుట ధర్నా

ఖమ్మంసంక్షేమవిభాగం:ప్రయాణికుల రద్దీ మేరకు బస్సులను పెంచాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని బస్సు డిపోలు ఎదుట నిరసన ధర్నాలు చేపట్టనున్నారు.

మీకు తెలుసా?

ముత్యాలమ్మ గుడి సెంటర్



ఖమ్మంసాంస్కృతికం:ముత్యాలమ్మ గుడి సెంటర్ ఖమ్మంనగర పురాతన వీదుల్లో ఒకటి. ఇక్కడగల ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయం కారణంగా ఈ ప్రాంతానికి ఆపేరు వచ్చింది. నగర వ్యాప్తంగా పలు చోట్ల ముత్యాలమ్మ దేవాలయాలు ఉన్నప్పటికీ ఇక్కడ గల గ్రామ దేవత ప్రత్యేకత కలిగిఉంది. వివాహమైన జంటలు ఈదేవాలయాన్నితప్పక దర్శించటం ఆనవాయితీ. ముత్యాలమ్మ గుడి సమీపంలోనే చర్చ్, మరికొంత దూరంలో మసీదు ఉండటం మతసామరస్యానికి దర్పణంగా బావిస్తారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంది

బీజేపీ రాష్ట్ర నేత తాండ్ర వినోదరావు

ఖమ్మంబైపాస్‌రోడ్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హామీలు నెరవేర్చకుండా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర నేత తాండ్ర వినోదరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ విమర్శించారు. నగరంలోని జిల్లా పార్టీకార్యాలయంలో మంగళవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ చేయని హామీలపై చార్జిషీట్ విడుదల కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చి వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. జిల్లాలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 58,59 జీవోల కింద అవినీతికి పాల్పడ్డారని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆభూములను వెనక్కి తీసుకుని చర్యలు తీసుకుంటామని ఇప్పుడు పట్టించుకోవటం లేదన్నారు.డబుల్ బెడ్‌రూం ఇళ్లలో అవినీతి జరిగిందని వాటిపై విచారణ గాలికి వదిలేశారన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని, వాటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, శ్యామ్‌రాథోడ్, లక్ష్మయ్య, అసెబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, కుమిలి శ్రీనివాస్, మంద సరస్వతి, కోటేశ్వరరావు ప్రదీప్‌పాల్గొన్నారు.

గరికపాటి సోదరులకు మంత్రుల పరామర్శ





ఖమ్మంరూరల్,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని బారుగూడెంలోని శ్రీసిటి చైర్మన్ గరికపాటి వెంకట్రావు, గరికపాటి అంజనేయప్రసాద్ సోదరుల తండ్రి రాఘవయ్య నాలుగు రోజుల క్రితం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం రాజీవ్‌స్వగృహ ప్రాంతంలోని వారి స్వగృహానికి వెళ్లి రాఘవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారిని పరామర్శించారు.

సీపీఎం డివిజన్ కమిటీల ఏర్పాటుకు నిర్ణయం

ఖమ్మంటౌన్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): సీపీఎం నిర్మాణంలో వచ్చిన మార్పుల ఆధారంగా తిరిగి జిల్లాలో డివిజన్ కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలో నిర్వహించిన పార్టీ వన్‌టౌన్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. డివిజన్‌కమిటీల ఏర్పాటులో భాగంగా ఈనెల 8న బోనకల్‌రోడ్‌లోని సెయింట్ మేరీస్ పాఠశాలలో ఖమ్మం అసెంబ్లీ డివిజన్ మహాసభను నిర్వహిస్తున్నామన్నారు. ఖమ్మం నగరంలో నెలకొన్న సమస్యలపై ఆందోళన చేసేందుకు మహాసభలో కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

నేడు జాతీయ సాధన సర్వే

పాఠశాలల్లో కేంద్రం బృందం పర్యటన

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించేందుకు కేంద్ర బృందం పాఠశాలల్లో పరీక్ష నిర్వహించనున్నది. రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ సాధన సర్వే-2024గా దీన్ని నిర్వహిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో బుధవారం ఈ సర్వే చేస్తున్నట్లు డీఈవో సోమశేఖర శర్మ, అకాడమిక్ మానటరింగ్ అధికారి రవికుమార్ తెలిపారు. 3,6,9 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించి వారి సామర్థ్యాలను తెలుసుకోనున్నారు. సీబీఎస్ఈ బోర్డు సభ్యుడు సందీప్ తివారిని ఢిల్లీ నుంచి జిల్లాలో పరీక్షల ప్రత్యేక అబ్జర్వర్‌గా నియమించారు. సుమారు 250మంది ఈ సర్వేను జరపనున్నారు.

ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి ఎలా అమలవుతోంది?

లోక్‌సభలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ప్రశ్న

ఖమ్మం సంక్షేమవిభాగం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఒకేజిల్లా ఒకే ఉత్పతి ఎలా అమలు జరుగుతుందని లోక్‌సభలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ప్రశ్నించారు. శీతాకాల సమావేశాల్లో ఎంపీ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను మార్కెటింగ్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రశ్నించారు. జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటుచేసి పర్యవేక్షణ పెంచాలని కోరారు.





సత్తుపల్లిలో జనసేన ఎమ్మెల్యే బాలరాజు సందడి



సత్తుపల్లిరూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రాలోని పోలవరం జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మంగళవారం సత్తుపల్లిలో ప్రత్యక్షమయ్యారు. స్థానికంగా ఓ ప్రయివేట్ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఇక్కడి జనసేన బాధ్యులు ఎమ్మెల్యేను మర్యాదాపూర్వకంగా కలిసి సన్మానించారు. జనసేన కార్యకర్తలు, పార్టీ స్థితిగతులపై ఆరాతీసినట్లు నాయకులు తెలిపారు. అనంతరం పోలవరం తిరుగు ప్రయాణమై వెళ్లారు. కార్యక్రమంలో జనసేన బాధ్యులు నరేష్, వంశీ, రాంబాబు, రామకృష్ణ, దివాకర్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జిలపైనే భారం..

» కీలకపోస్టులు ఖాళీ
» సకాలంలో ప్రజలకు అందని సేవలు



ఖాళీగా ఉన్న ఏఈ కుర్చీ

తల్లాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలోని ప్రధాన ప్రభుత్వ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఇతర అధికారులకు ఇన్‌చార్జ్ అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల సకాలంలో ప్రజలకు సేవలు అందని పరిస్థితి నెలకొంది. తల్లాడ మండలంలోని తహసీల్దార్, మండలపరిషత్ ఏఈ, కార్యదర్శి, చైన్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తల్లాడ తహసీల్దార్‌గా పనిచేసిన వర్రా రవికుమార్ ఈ ఏడాది అక్టోబరు 13న ఖమ్మం అర్బన్‌కు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుతం ఉపతహసీల్దార్ ఏ.వనజకు ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాధ్యతలను అప్పగించారు. మండల ప్రజాపరిషత్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేసిన ఎం.అశోక్ ఈ ఏడాది జూలై 22న బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పూర్తిస్థాయి ఏఈని నియమించకుండా కల్లూరు సబ్‌డివిజన్ ఏఈ కార్తీక్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. తహసీల్దార్ కార్యాలయంలో ల్యాండ్ సర్వే చైన్‌మెన్‌గా పనిచేసిన మదార్ ఆగస్టు నెలాఖరులో రిటైర్డ్ అయ్యారు. ప్రస్తుతం పోస్టు ఖాళీగా ఉంది. మండలంలోని రామానుజవరం గ్రామపంచాయతీ కార్యదర్శి బాణోతు యుగంధర్‌కు టీచర్ ఉద్యోగం రావడంతో అక్టోబరు 18న రిలీవ్ అయ్యారు. అప్పటి నుంచి కార్యదర్శి పోస్టు ఖాళీగా ఉంది. కీలకమైన తహసీల్దార్, మండలపరిషత్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి, చైన్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల ఆయాశాఖలకు సంబంధించిన ప్రభుత్వ సేవలు ప్రజలకు సకాలంలో అందని పరిస్థితి నెలకొంది.

ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి

నర్సింహారావు, సొసైటీ వైస్‌చైర్మన్, తల్లాడ



మండలంలో కీలకమైన తహసీల్దార్, మండలపరిషత్ ఏఈ, చైన్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల ప్రజలకు సకాలంలో ప్రభుత్వ సేవలు అందని పరిస్థితి నెలకొంది. తహసీల్దార్ లేకపోవడం వల్ల వివిధ రకాల సర్టిఫికెట్లు, ల్యాండ్ రిజిస్ట్రేషన్, ధరణి సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతుంది. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల విషయంలో మండలపరిషత్ ఏఈ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తక్షణమే ప్రభుత్వం స్పందించి మండలంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి.

పరిహారం పెంచండి

» మంత్రి తుమ్మలను కోరిన ఏన్కూరు లింక్ కెనాల్ భూ నిర్వాసితులు



ఏన్కూరు రైతులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఏన్కూరు, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సీతారామ ఏన్కూరు లింక్‌కెనాల్ భూనిర్వాసితులు కలిశారు. మంగళవారం ఖమ్మం క్యాంపు కార్యాలయంలో ఏన్కూరు, భగవాన్‌నాయక్తండా, రేపల్లెవాడ, హిమాంనగర్ గ్రామాల రైతులు మంత్రి తుమ్మలను కలిసి సమస్యలను విన్నవించారు. త్వరగా నష్టపరిహారం చెల్లించాలని, ఎకరానికి రూ.25నుంచి 30లక్షలు చెల్లించాలని రైతులు కోరగా అందుకు మంత్రి తుమ్మల సానుకూలంగా స్పందించారు. వెంటనే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. త్వరగా నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తన మీద నమ్మకంతో భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి మెరుగైన ప్యాకేజీ కోసం కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో రైతులు మేడ ధర్మారావు, స్వర్ణ నరేంద్రకుమార్, వెనిగళ్ల శ్రీహరి, యండ్రాతి శ్రీను, ఆది నరసింహారావు, మాలోతు నరసింహారావు, పాల్గొన్నారు.

ఫుడ్‌పార్క్‌లో ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

సత్తుపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం బుగ్గపాడులోని మెగా ఫుడ్‌పార్క్‌ను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మంగళవారం సందర్శించారు. ఈ నెల 5న మెగా ఫుడ్‌పార్క్ ప్రారంభోత్సవం అనంతరం జరిగే అగ్రో అవగాహన సదస్సు ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ టీజీఐఐసీ ఎస్‌ఈ వినోద్‌కుమార్, జోనల్ మేనేజర్ మహేశ్వర్‌లతో మాట్లాడుతూ మెగా ఫుడ్ పార్క్ ఉద్దేశ్యం రైతులకు అర్థమయ్యే రీతిలో ఉండాలని సూచించారు. ఫుడ్‌పార్క్‌కు సంబంధించిన వీడియో ప్రదర్శనకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. అవగాహన సదస్సు వేదిక సమీపంలో వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. దీనికోసం ఉద్యానవన, వ్యవసాయ, విద్యుత్ అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. కల్లూరు ఆర్డీవో రాజేందర్ గౌడ్ పర్యవేక్షిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు.

17శాతం లోపు తేమ ఉన్న ధాన్యమే తీసుకురావాలి: ఏడీఏ

మధిర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు 17శాతం లోపు తేమ మాత్రమే ఉండేలా చూసుకొని తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలని ఏడీఏ విజయచంద్ర సూచించారు. మంగళవారం మధిర మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏడీఏ సందర్శించి కొనుగోలు జరుగుతున్న తీరును పరిశీలించారు. రైతులు తెచ్చిన ధాన్యంలోని తేమశాతంను పరిశీలించారు. ప్రమాణాలు పాటించి గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. రైతులు ఈ అవకాశం వినియోగించుకొని గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు జిష్ణు, అమృత, మధిర, మడుపల్లికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎనిమిది వరకు సీసీఐ కేంద్రానికి పత్తి తీసుకురావొద్దు

కారేపల్లి డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రైతులతోపాటు ఇతరప్రాంతాలకు చెందిన రైతులు బుధవారం నుంచి ఈనెల 8వరకు రైతులు సీసీఐ కేంద్రానికి పత్తిని విక్రయించేందుకు తీసుకురావద్దని కార్యదర్శి నరేష్‌కుమార్ మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. జిన్నింగ్ మిల్లులులో అధికంగా పత్తి నిల్వలు ఉండటంతో, పత్తిని జిన్నింగ్ చేయడం ఇబ్బందిగా ఉందని, విషయాన్ని గమనించి పత్తిని తీసుకురావద్దని నరేష్ కుమార్ తెలిపారు.

మత్తు పదార్థాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన

ముదిగొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అనేకమంది యువతీయువకులు మత్తుపదార్థాలకు బానిసలై అఘాయిత్యాలు, ఆత్మహత్యలకు పాల్పడటం జరుగుతుందని యాంటీ నార్కోటిక్ ఖమ్మం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.రాము తెలిపారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గంజాయి, మత్తుపదార్థాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్, ఎస్‌ఐ గజ్జల నరేష్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో మోదుగు వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడోత్సవాల సన్నాహక సమావేశం

ఎర్రుపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీవో గంధం శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సీఎంకప్ సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ వీడియోకాన్ఫరెన్సులో సీఎం కప్ విధివిధానాలను తెలుసుకునేందుకు అధికారులు హాజరయ్యారు. మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు, పంచాయతీల సెక్రటరీల నేతృత్వంలో గ్రామస్థాయి నుంచి నిర్వహించే ఈక్రీడలో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జరగనున్నాయి. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు జమలయ్య, త్రిపుర నాగేశ్వరరావు, గ్రామపంచాయతీ సెక్రటరీలు ఏలేశ్వరరావు, జి.కుమార్ పాల్గొన్నారు.

అవయవదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

మధిర రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నేత్రదానం, అవయవదానం ఆఖరి అంతిమయాత్ర సమయంలో ఎవరైనా చనిపోతే ఆపార్థివ దేహాన్ని దానం చేయటానికి ప్రతి కుటుంబీకులు ముందుకు రావాలని సామాజిక సేవకుడు, రిటైర్డ్ ఎంపీడీవో మాధవరపు నాగేశ్వరరావు కోరారు. మంగళవారం దెందుకూరు పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందికి నేత్రదానం, అవయవదానం గురించి వివరించారు.అనంతరం మాధవరపు నాగేశ్వరరావును పీహెచ్‌సీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యుడు డాక్టర్ పృథ్వీనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

మధిర రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా చేపడుతున్నట్లు టీడీపీ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం తెలిపారు. మంగళవారం మధిరలోని 13వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు పార్టీ సభ్యులు సభ్యత్వాన్ని రెన్యూవల్ చేయించుకున్నారు. అనంతరం నూతన సభ్యత్వాలను స్వీకరించారు. అనంతరం డాక్టర్ రామనాథం మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చేకూరి శేఖర్‌బాబు, మల్లాది హన్మంతరావు, వేమూరి సునీల్, అనుమోలు సతీష్, గోపి పాల్గొన్నారు.

'ఆశా' వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

వైరా/ఏన్కూరు/కారేపల్లి/మధిరరూరల్/తల్లాడ డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల వైద్యాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. బుధవారం కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు. వైరా, ఏన్కూరు, కారేపల్లి, మధిర, తల్లాడ మండలాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో సీఐటీయూ నాయకులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల దినోత్సవ వేడుకలు

వైరా/పెనుబల్లి/బోనకల్/తల్లాడ డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైరాలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. పెనుబల్లిలోను దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. వైరా మునిసిపల్ చైర్మన్ జైపాల్, పెనుబల్లి లో జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ సీఎంవో రాజశేఖర్, ఎంఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. తల్లాడలో ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు.

దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు పెంచాలి

వైరా, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలో దొడ్డురకాల ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెంచకపోతే రైతులతో కలిసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు హెచ్చరించారు. మంగళవారం వైరాలోని బోడేపూడి భవన్‌లో మల్లెంపాటి రామారావు అధ్యక్షతన జరిగిన రైతుసంఘ సమావేశంలో రాంబాబు మాట్లాడారు. మండలంలో ఏర్పాటుచేసిన 21 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కేవలం రెండు మాత్రమే దొడ్డు రకాల ధాన్యం కొనుగోలు కేంద్రాలున్నాయని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలను పెంచకపోతే రైతులను కదిలించి ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు చింతనిప్పు చలపతిరావు, మేడా శరాబందీ, వనమా చిన్నసత్యనారాయణ, బాణాల శ్రీనివాసరావు, షేక్.జానిమియా, కొంగర సుధాకర్, సంక్రాంతి నర్సయ్య, యనమద్ది రామకృష్ణ, వడ్లమూడి మధు, షేక్.మజీద్, రెహన పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలకు 66 మోసాలు: బీజేపీ

వైరా, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల అమలుతో అధికారంలోకి వచ్చి 66మోసాలకు పాల్పడిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోదరావు విమర్శించారు. మంగళవారం వైరాలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు... 66మోసాలపై చార్జ్‌షీటు విడుదల చేశారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని వినోదరావు విమర్శించారు. బీజేపీ నాయకులు నెల్లూరి కోటేశ్వరరావు, బండారు నరేష్, దుద్దుకూరి కార్తీక్, మనుబోలు వెంకటకృష్ణ, మల్లికార్జున్, మేకల మల్లేష్, రామారావు, రాజేందర్, కల్యాణ్ పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలు..

వైరా/సత్తుపల్లి/సత్తుపల్లిరూరల్/మధిరటౌన్ డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం ప్రజాపాలన విజయోత్సవాన్ని చైర్మన్ సూతకాని జైపాల్ ప్రారంభించారు. మునిసిపాలిటీలోని పారిశుధ్య కార్మికులను చైర్మన్, వైస్‌చైర్మన్, కమిషనర్ జైపాల్, ముళ్లపాటి సీతారాములు, చింతా వేణు సన్మానించారు. పారిశుధ్య కార్మికులకు వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. కౌన్సిలర్ మాదినేని సునీత, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పమ్మి అశోక్ పాల్గొన్నారు.

సత్తుపల్లి మునిసిపాలిటీలో 2కే రన్

సత్తుపల్లిరూరల్ (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా మంగళవారం సత్తుపల్లి మునిసిపాలిటీలో నీలాద్రి అర్బన్ పార్క్ నుంచి మునిసిపల్ ఆఫీస్ వరకు విద్యార్థులు 2కే రన్ నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ మందా రవిబాబు జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులతో పాటు ఆయా శాఖల అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

కాకర్లపల్లిలో కళాజాత బృందం సందడి

సత్తుపల్లిరూరల్ (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవ సంబురాలలో భాగంగా మండలంలోని కాకర్లపల్లితో పాటు పలు గ్రామాలలో జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారధి చాపలమడుగు కోటేశ్వరరావు కళా బృందం మంగళవారం కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారులు కోటేశ్వరరావు, మునగాల వెంకటరత్నం, బీరెల్లి రమణ, మేడా ముత్తయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ

మధిరటౌన్, (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అవుతున్న సందర్భంగా మంగళవారం మధిరలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని పలు పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీవో సురేష్‌బాబు సందర్శించి పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో కల్లూరు గ్రామ పంచాయితీ ఈవో నందిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ గురుకులంలో ఫిర్యాదుపై విచారణ

తల్లిదండ్రులు, విద్యార్థులు, యాజమాన్యంతో సోషల్ వెల్ఫేర్ డీడీ విచారణ



విచారణ నిర్వహిస్తున్న డీడీ కస్తాల

వైరా, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలపై విద్యార్థినుల తల్లిదండ్రులు సోమవారం ఆగురుకులాల జోనల్ అధికారి, కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఖమ్మం జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ విచారణ నిర్వహించారు. వైరా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వల్ల విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దాంతో కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ ఆదేశాలతో సోషల్ వెల్ఫేర్ డీడీ సత్యనారాయణ మంగళవారం రాత్రి వరకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు, విద్యార్థినిలు, ప్రిన్సిపాల్, అధ్యాపకులను ఈ సమస్యపై విచారణ నిర్వహించారు. మురిగిపోయిన కోడిగుడ్లు, కుళ్లిపోయిన కూరగాయలతో ఉడికిఉడకని అన్నం పెడుతున్నారని, మెనూ పాటించడం లేదని, ప్రిన్సిపాల్ విద్యార్థినుల పట్ల వ్యతిరేక ధోరణిని అవలంబిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాదాపు 640మంది విద్యార్థినులు ప్రిన్సిపాల్ పర్యవేక్షణ లోపం వలన టీచర్ల విద్యాబోధన లోపభూయిష్టంగా ఉండటం వల్ల సత్సంబంధాలు కొరవడ్డాయని ఆరోపించారు. గతంలో మజ్జిగలో బల్లిపడి ముగ్గురు అస్వస్థతకు గురైనా ఆవిషయాన్ని గోప్యంగా ఉంచారని, మూడునెలల నుంచి చికెన్, మటన్, కోడిగుడ్లు సరిగా పెట్టడం లేదని, అకారణంగా 8వతరగతి విద్యార్థినికి టీసీ ఇచ్చారని, ఆడపిల్లల గురుకులంలో యువకులతో వంట చేయిస్తున్నారని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కస్తాల సత్యనారాయణ విచారణ నిర్వహించారు. ఈ విచారణ సమయంలో కొంత ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. తాను చేసిన విచారణ నివేదికను కలెక్టర్‌కు నివేదిస్తామని విచారణ అధికారి సత్యనారాయణ తెలిపారు.

వితంతు పింఛన్ బకాయిలు ఇవ్వాలి: ఐద్వా

వైరా, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న వితంతు పింఛన్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఐద్వా ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాం నుంచి అర్హులైన వితంతువులకు పింఛన్లు రావడం లేదని, ఆన్‌లైన్ అయినప్పటికీ ఇంతవరకు పట్టించుకున్నవారే లేరన్నారు. వితంతువులకు ఆసరా పింఛన్లు ఇవ్వకపోవడం సిగ్గుచేటని మాజీ ఎంపీపీ బొంతు సమత విమర్శించారు. మునిసిపల్ కార్యాలయంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ఐద్వా నాయకురాళ్లు మచ్చా మణి, తోట కృష్ణవేణి, మల్లికాంబ, బత్తుల ప్రమీల, భూక్యా విజయ, చింతనిప్పు సులోచన, తాటి కృష్ణకుమారి, కళావతి, ప్రియాంక, సుజాత, వెంకటరమణ, ప్రసన్న, లక్ష్మీతులసి, పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్వర్ణిక ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగులకు ఉచితంగా బస్‌పాస్‌లను ఆర్టీసీ డీఎం యూ.రాజ్యలక్ష్మీ పంపిణీ చేశారు. మానవ హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కిన్నెర వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో ట్రస్ట్ బాధ్యుడు వలపర్ల రవికుమార్ చొరవ తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. డీఎంను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీబీపీ కిన్నెర ఆనందరావు, కిన్నెర పవన్‌కుమార్, ఎల్‌ఎస్.రెడ్డి, శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి: రైతుసంఘం

ఏన్కూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ అమలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం రైతు సంఘం బృందం ఏన్కూరు మండలంలో ఇంటింటికి తిరిగి రుణమాఫీ వివరాలు స్వీకరించింది. రాంబాబు మాట్లాడుతూ ఏన్కూరు మండలంలో వేలాది మంది రైతులు 2018 కంటే ముందు పహాణీపై బ్యాంకు రుణం పొందారని తెలిపారు. ప్రభుత్వం పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులకు మాత్రమే రుణమాఫీ చేయడంతో, ఎక్కువమంది రైతులు రుణమాఫీకి నోచుకోలేదన్నారు. షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని కోరారు. మండల కార్యదర్శి దొంతబోయిన నాగేశ్వరరావు, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి లక్మా, మండల అధ్యక్షుడు తమ్మినేని వెంకయ్య మాజీసర్పంచ్ చిన్నకోటయ్య పాల్గొన్నారు.

త్వరలో ఇందిరమ్మ ఇళ్లు: ఎమ్మెల్యే రాగమయి



ప్రజాపాలన విజయోత్సవాల్లో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలన పూర్తి చేసిన కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని, త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు అందించే బాధ్యత తమదేనని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో సింగరేణి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆర్‌వో మినరల్ వాటర్ ప్లాంట్, రూ.56లక్షలతో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభంతో పాటు రూ.12లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన అంగన్‌వాడీ భవనానికి ఆమె శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ ఈ ఏడాది కాలంలో గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, త్వరలో జరిగే పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించినట్లయితే ప్రభుత్వం అందించే పథకాలు మనకు చేరతాయన్నారు. బీఆర్‌ఎస్ బోగస్ ప్రచారాలను తిప్పికొడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలను అమలు చేశారన్నారు. ప్రతిపక్షాలకు చెంపచెల్లుమనేలా దేశ చరిత్రలోనే రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఏకక ప్రభుత్వం మనదేనన్నారు. అదేవిధంగా ఈనెల 5న బుగ్గపాడులోని మెగా ఫుడ్‌పార్క్‌లో జరిగే ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలను జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. అంతకుముందు సత్తుపల్లి మునిసిపాలిటీలోని పలు వార్డులలో అభివృద్ధికి కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులతో పాటు గ్రామస్థులు గొర్లమారి రామ్మోహన్‌రెడ్డి, మేకా సతీష్‌రెడ్డి, కొప్పుల నరేందర్‌రెడ్డి, బయినంపూడి శ్రీనివాసరావు, బయినంపూడి నాగు, బొమ్మారెడ్డి వెంకటరెడ్డి, కొప్పుల దామోదర్‌రెడ్డి, కొప్పుల శ్రీనివాసరెడ్డి, దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏడాది పాలన సందర్భంగా కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు.

సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన

వేంసూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంచపర్తి, శంభునిగూడెం, బీరాపలి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే మట్టా రాగమయి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.ఏ.రాజు, ఎంపీడీవో నాగేశ్వరరావు, ఎంపీవో రంజిత్ పాల్గొన్నారు.

108 కేటాయించడంపై హర్షం

కొణిజర్ల, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలానికి అత్యవసరమైన 108ను, 102ను ప్రభుత్వం కేటాయించిందని, ప్రజలకు నిత్యవసరమైన వాహనాలను కేటాయించడం పట్ల మంగళవారం కొణిజర్ల మాజీ సర్పంచ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు సూరంపల్లి రామారావు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజల కోసం ఆలోచిస్తుందని తెలిపారు.

భార్యాభర్తలపై దాడి: కేసు నమోదు

చింతకాని, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఐదుగురుపై మంగళవారం కేసు నమోదైంది. గ్రామానికి చెందిన భార్యాభర్తలు మొగిలి అభిలాష్, మమత గ్రామంలో జరిగిన ఓ శుభ కార్యక్రమంలో పాల్గొని ఇంటికి కారులో తిరిగి వెళ్తుండగా గ్రామానికి చెందిన మొగిలి శ్రీను, నరేష్, మాధవరావు, వీరబాబు, బోజ్జగాని వెంకటేశ్వర్లు కారు అడ్డగించి రాళ్లు, కర్రలతో కారును ధ్వంసం చేశారు. ఈ ఘటనలో అభిలాష్ అతని భార్య మమతలకు గాయాలైనవి. అభిలాష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పోతురాజు నవ్యపై కుటుంబ కలహాల నేపథ్యంలో బంధువులు లింగమ్మ, వెంకటేశ్వర్లు, ఆనంద్, రెడ్డిబోయిన లలితలు దాడి చేసి గాయపర్చారు. బాధితురాలు నవ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు.